

కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జేసీ కార్తీక్ తదితరులు

పొట్టిశ్రీరాములు త్యాగం
అజరామరం

- జాయింట్ కలెక్టర్ కార్తీక్
- ఘనంగా ఆత్మార్పణ దినం

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టిశ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రప టానికి జేసీ కార్తీక్, జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. అనంతరం సమాచారశాఖ రూపొందించిన డాక్యుమెంటరీ వీడియోను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా జేసీ కార్తీక్ మాట్లాడుతూ తెలుగుజాతి కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని తెలిపారు. అనంతరం ఆత్మకూరు జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు ఆలపించిన దేశభక్తి గీతాలు అందరినీ అలరించాయి. జేసీ కార్తీక్, సంగీత ఉపాధ్యాయురాలు మల్లాది అనూషా తదితరులు విద్యార్థినులను అభినందించారు. 'పుణ్యభూమి నా దేశం.. నమో నమామీ' అనే సినీగీతాన్ని సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు విద్యార్థులతో కలిసి ఆలపించారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ ఉషారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురి నివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సోమిరెడ్డి తదితరులు

నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల పొట్టిశ్రీరాములు విగ్రహానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. నగర మేయర్ స్రవంతి కూడా పొట్టిశ్రీరా ములు విగ్రహానికి పూలమాల వేసి ఆయన త్యాగాలను స్మరించుకున్నారు.

- నెల్లూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నాయకులు పొట్టిశ్రీరాములు చిత్రపటాన్ని స్టోన్‌హౌస్‌పేట నుంచి ఊరేగింపుగా ఆత్మకూరు బస్టాండ్‌కు తీసుకువచ్చారు. అక్కడ పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. ఈ సందర్భంగా పాండురంగ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి మేగు షణ్ముఖరావు, కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ కోటగురుబ్రహ్మం, అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్స్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, నాయకులు బ్రహ్మంగుప్తా, ఆర్‌కేటీ శేష య్య, జనసేన నాయకులు నూనె మల్లికార్జున్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా గ్రంథాలయ సంస్థలో పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఎస్పీ కృష్ణకాంత్

లాఠీలు వదలి.. ఆటలాడారు !

- ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్
- పరేడ్ మైదానంలో ఎస్పీ ప్రారంభం
- మూడు రోజుల పాటు పోటీల నిర్వహణ

నెల్లూరు(క్రైం),డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూనిఫాం ధరించి, చేతిలో లాఠీ పట్టుకొని నిరంతరం విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది క్రీడా దుస్తులు ధరించి మైదానంలో సరదాగా ఆటలాడారు. నెల్లూరు నగరంలోని పోలీసు పరేడు మైదానంలో ఆదివారం పోలీసు స్పోర్ట్స్ మీట్-2024ను ఎస్పీ జీ కృష్ణకాంత్ ప్రారంభించారు. మొదటగా కపోతాలను, బెలూన్లను గాల్లోకి ఎగురవేసి స్పోర్ట్స్ టార్చ్‌ను వెలిగించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గెలుపోటములతో నిమిత్తం లేకుండా క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలన్నారు. నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసు సిబ్బందిలో స్పోర్ట్స్ మీట్ మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ స్పోర్ట్స్‌మీట్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొన్నారు. ఈ పోటీల్లో నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్‌డివిజన్‌లతో పాటు ఏఆర్, హోంగార్డ్స్ విభాగాల్లోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తొలిరోజు పరుగు పందెం, వాలీబాల్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. అధికా రులు, సిబ్బందితో కలిసి ఎస్పీ వాలీబాల్ ఆడి అందరిలోనూ క్రీడాస్ఫూర్తిని నింపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన పురుష, మహిళా సిబ్బందికి మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, మునిరాజ్, డీఎస్పీలు డీ శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాస్, శ్రీధర్, ఏ శ్రీనివాసరావు, రాజగోపాల్, సీహెచ్ రామారావు, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న పోలీసులు



డిస్క్‌త్రో ఆడుతున్న మహిళా కానిస్టేబుల్



చలిరక్షణగా ఉన్ని దుస్తులు ధరించి..

పొగమంచులో వాహనాల రాకపోకలు

అమ్మో... చలి !

- పొగమంచు ప్రభావం ఎక్కువే
- వైరస్ విజృంభించే అవకాశం
- వ్యాధుల బారిన చిన్నారులు, వృద్ధులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాను కొద్ది రోజులుగా చలి వణికిస్తుంది. గత ఏడాది ఇదే నెలలో 24 డిగ్రీలకే వణు కు పుట్టించిన చలి తీవ్రత.. ప్రస్తుతం 19 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకోవటంతో దీని ప్రభావంతో జిల్లా ప్రజలపై పడి, తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. రాపూరు, వెంకటగిరి, ఉదయగిరి మండలాలు అటవీ ప్రాంతాల్లోనూ, ఇందుకూరుపేట, విడవలూరు, టీపీ గూడూరు తదితర మండలాలు సముద్రం తీరం వెంబడి ఉండడంతో ఆయా మండలాల్లోని గ్రామాలపై చలి ప్రభావం ఎక్కువగానే ఉంది. దీనికితోడు పొగమంచుతో రహదారులు పూర్తిగా కనిపించక వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ చలితీవ్రత ఫిబ్రవరి వరకు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రాత్రుళ్లే కాక పగటి పూట కూడా చలి తీవ్రత ఎక్కువగా ఉంటున్నది. ఈ క్రమంలో కొందరు స్వెటర్లు, టోపీలు, గ్లౌజులు, ఇతర ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు సాయంత్రం 7 గంటల నుంచే చలి ప్రారంభమవుతోంది. తెల్లవారు జామున మంచు కారణంగా రహదారులపై వెళ్లాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఉదయం 9 గంటల వరకు మంచు వీడక పోవటంతో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ, భవననిర్మాణ, ఇతర కూలీలు ఉదయం పనులకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు.

చలి తీవ్రత ఇలా...

తేదీ	కనిష్ట	గరిష్ట
9	19.0	22.5
10	25.4	32.7
11	25.1	32.6
12	26.0	29.1
13	26.4	26.0
14	24.8	29.4
15	23.3	30.6

వైరస్ ప్రభావం ఎక్కువే..

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే 98.6 డిగ్రీల ఫారన్‌హీట్ అవసరం. 96 ఫారన్‌హీట్‌కు ఉష్ణోగ్రత పడిపోయినా, 108కి పెరిగినా శరీరం తట్టుకునే పరిస్థితి లేదు. వృద్ధులు, చిన్నారులపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. చలి తీవ్రత కారణంగా రక్తం వెచ్చదనంగా మారి, శరీరం చెమటలు పడుతుంది. పాల్సీఫారం, ఇన్‌ఫ్లూమెంజా వైరస్‌లు విజృంభించి దాడి చేస్తాయి. దీనివల్ల న్యూమోనియా సోకి ఊపిరితిత్తు లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శరీరం లోని చేతి వేళ్లు, కాలివేళ్లు, చెవుల కొనలు వంటి భాగాలకు రక్తప్రసరణ ఆగి చర్మ వ్యాధులకు దారితీస్తుంది. ఫంగస్ సమస్య తలెత్తుతుంది. రోగ నిరోధక శక్తి సన్నగిల్లుతుంది. డస్ట్ , లంగ్ ఎలర్జీలు వస్తాయి. అత్యల్ప ఉష్ణోగ్రతలు కారణంగా 60 ఏళ్లపైబడ్డ వృద్ధులకు, ఐదేళ్ల లోపు చిన్నారులకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. దీనికి తోడు ప్రస్తుతం కరోనా వైరస్ ప్రభావం ఉండటంతో చలికాలంలోనే ఈ వైరస్ కూడా విజృం భించే అవకాశం ఉంది. ఈ కాలంలోనే బెల్స్ పాల్సీ అనే వైరస్ వ్యాప్తి చెందుతుండడంతో పక్షవాతాన్ని పోలే మూతి నొక్కుడు వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మహిళల్లో హార్మోన్ల సమస్య అధిక మవుతుంది. మధు మేహం, థైరాయిడ్ వ్యాధి ఉన్న వారిపై చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. చలి తీవ్రత వల్ల గుండె, ఊపిరితిత్తులకు రక్త ప్రసరణ సరిగా జరగక ప్రాణాపాయ పరిస్థితికి దారి తీస్తుంది. ఇక ఆస్తమా వ్యాధిగ్రస్తుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదం తప్పదంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తత అవసరం

చలి నుంచి విముక్తి పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఉన్ని దుస్తులు ధరించ డంతో పాటు మంకీ క్యాప్, స్వెటర్లు, శరీరం పూర్తిగా కప్పేలా దుస్తులు, కాళ్లకు సాక్సులు, చేతులకు గ్లౌజులు వేసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే వేడిచేసి చల్లార్చిన, గోరువెచ్చని నీటిని తాగాలని చెబుతు న్నారు. చలిలో బయట తిరగడం మంచిది కాదని వారు హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



గత ఏడాది కంటే ఈ ఏడాదే చలి తీవ్రత ఎక్కువగా ఉంది. వృద్ధులు, చిన్నారుల పట్ల కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాలలోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో చలి ప్రభావం ఎక్కువగానే ఉంది. పొగమంచు కారణంగా జాతీయ రహదారుల్లో వెళ్లే వాహన దారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ కృష్ణమూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

వైరస్ ప్రభావం చాలా ఎక్కువ



చలికాలంలోనే వైరస్ ప్రభావం ఎక్కువగా ఉం టుంది. ఊపిరితిత్తుల వ్యాధులతోపాటు ప్రాణాం తకమైన వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. రక్తం సరఫరా తగ్గి గుండె, ఊపిరితిత్తుల వ్యాధులకు దారితీస్తుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాంతకమే. వైరస్‌కు గురికాకుండా మాస్కులు, శానిటైజర్లు వాడటం మంచిది.

- డాక్టర్ గంగాధర్, జనరల్ ఫిజీషియన్, జీజీహెచ్

'రూ.కోట్లు సంపాదించాం... అందులో కొంత ఖర్చు చేస్తే విచారణ నుంచి తప్పించుకోవచ్చు.... ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.. మేము విజిలెన్స్ అధికారులనే కాదు.. ఎమ్మెల్యేలకు దగ్గరగా ఉండే వ్యక్తులను కూడా మేనేజ్ చేస్తున్నాం... అందరూ తమ వంతుగా ఎంతోకొంత ఇవ్వండి'.... అంటూ హౌసింగ్ విభాగంలో కొందరు వ్యక్తులు దండకాలు మొదలుపెట్టారు. ఇప్పటికే అవినీతిలో భాగస్వాములైన పలువురు అధికారులు, ఉద్యోగుల వద్ద నుంచి నగదును వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఎంత ఖర్చయినా పర్వాలేదు కానీ, విజిలెన్స్ విచారణ నుంచి మాత్రం తప్పించుకోవాలి... అని అక్రమార్కులు శతవిధాలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇంత ధైర్యంగా విజిలెన్స్ అధికారుల పేరుతో దండకాలు చేస్తుండడం హౌసింగ్ విభాగంలో చర్చనీయాంశంగా మారింది.

- డబ్బులివ్వండి.. విచారణ నుంచి తప్పిస్తాం...
- గృహనిర్మాణశాఖలో అక్రమార్కుల బరితెగింపు
- అవినీతిలో భాగస్వాముల నుంచి నగదు వసూళ్లు
- కీలకంగా వ్యవహరిస్తున్న కొందరు ఉద్యోగులు
- అక్రమాలు బయటపడుతుండడంతో గుబులు

'హౌసింగ్'లో
దండకాలు

నెల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం హయాంలో హౌసింగ్ విభాగంలో అంతులేని అవినీతి జరిగింది. పేదల ఇళ్ల మాటున భారీ అక్రమాలు జరిగాయి. రూ.వందల కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టింది. ప్రతీ లేఅవుట్‌లోనూ ఇళ్ల నిర్మాణం నాసిరకంగా జరిగింది. నాసిరకంగా నిర్మించడం ఒక ఎత్తయితే.. అసలు ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు తినేయడం మరో ఎత్తు. ఇళ్ల నిర్మాణం చేయకుండానే లబ్ధిదారుడికి తెలియకుండా సిమెంటు, స్టీలు, నగదు డ్రా అయిపోయాయి. ఎప్పుడో నిర్మించిన ఇళ్లకు కూడా ఇప్పుడు కొత్త పథకంలో డబ్బులు తీసుకున్న సంఘటనలూ వెలుగు చూశాయి.

పేదల ఇళ్లకు రూ. వెయ్యి కోట్లు

జిల్లాలో సుమారు రూ.వెయ్యి కోట్లను పేదల ఇళ్ల కోసం చెల్లించగా, కనీసం వెయ్యి ఇళ్లల్లో కూడా పేదలు నివాసం ఉండలేకపోతున్నారంటే ఆ ఇళ్లు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ ప్రభుత్వంలో ఈ అవినీతిని పట్టించుకున్న నాథుడే లేడు. కళ్ల ముందు కనిపిస్తున్నా తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరించారు. అప్పట్లోనే అనేక ఫిర్యాదులు రాష్ట్ర ఉన్నతాధికారులకు అందాయి. వీటిపై జిల్లాలో విచారణ కూడా జరిగింది. చాలా చోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి హౌసింగ్ విజిలెన్స్ విభాగం నివేదికలు కూడా ఇచ్చింది. కానీ వాటి ఆధారంగా ఏ ఒక్కరిపై చర్యలు తీసుకోకపోగా ఆ తర్వాత కూడా పరిస్థితిని చక్కబెట్టలేదు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా పేదల సొమ్మును పంచుకుతిన్నారు. అయితే నాడు ప్రతిపక్ష హోదాల్లో ఉన్న ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యేలు పేదల ఇళ్లల్లో జరిగిన అవినీతిని ప్రశ్నిస్తూ వచ్చారు. ఇదే క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఇళ్ల నిర్మాణ పథకంలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్‌కు విచారణకు ఆదేశించింది. విచారణ మొదలుపెట్టిన విజిలెన్స్ అధికారులు అనేక అక్రమాలను గుర్తించారు. గోదాముల్లో ఉన్న నిల్వలకు, పేమెంట్ వివరాలకు మధ్య భారీ వ్యత్యాసాన్ని గుర్తించా రు. ఇందుకు బాధ్యు లుగా జిల్లాలోని ఇంజ నీరింగ్ అసిస్టెంట్లకు నోటీసులు పంపేలా చేశారు. ఇక్కడే సుమారు రూ.100 కోట్లకుపైగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఇక హౌసింగ్ అధికారులు రికార్డుల్లో రాసు కున్నట్లుగా నిజంగానే లబ్ధిదా రులకు బిల్లులు అందాయా..? అన్న వివరాలను విచారిస్తే మరిన్ని అవకతవకలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. అదే కాకుండా ఇళ్ల నాణ్యతపై కూడా విచారణ జరిపితే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో బట్టబయల వుతుంది. విజిలెన్స్ విచారణ మరింత లోతుగా జరిగితే ఈ అక్రమ వ్యవహారాలన్నీ వెలుగులోకి వచ్చే అవకాశముండడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు రేగింది.

విచారణను అడ్డుకునేందుకు కుట్రలు

ఈ నేపథ్యంలో ఎలాగైనా విజిలెన్స్ విచారణను అడ్డుకునేందుకు హౌసింగ్‌లోని అక్రమార్కులు కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల గుంపులు గుంపులుగా ఎమ్మెల్యేల వద్దకు పరుగులు తీశారు. వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో తప్పులు చేయాల్సి వచ్చిందంటూ చెప్పుకున్నారు. కానీ ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు మరోమార్గంగా నగదుతో మేనేజ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే విజిలెన్స్ విచారణ అంశంపై రహస్య సమావేశం పెట్టుకున్న అక్రమార్కులంతా.. డబ్బులు దండి మేనేజ్ చేసుకోవాలని తీర్మానించుకున్నట్లు ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు ఉద్యోగులు ఇందులో కీలకంగా వ్యవహరిస్తూ వసూళ్లు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.

- రాళ్లపాడు వద్ద రైతుల ధర్నా
- దెబ్బతిన్న కుడి కాలువ గేటు పైకిలాగి నీళ్లు ఇవ్వండి
- లేకుంటే పురుగుమందు తాగుతానన్న రైతు
- ఇసుకపాలెం వద్ద దిగువకు నీరు వెళ్లకుండా అడ్డుకట్ట



రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

నారు, నాట్లు ఎండుతున్నాయ్...
ఆయకట్టుకు నీరివ్వండి

లింగ సముద్రం, డిసెంబరు 15: మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ఆదివారం ఆయకట్టు రైతులు ధర్నా నిర్వహించారు. కుడి కాలువ తూము వద్ద ఎదురుగా ఉన్న రోడ్డుపై కూర్చొని వాహనాల రాకపోకలను నిలిపి వేశారు. మధ్యా హ్నం ఒంటి గంట సమయంలో చినపవని, పెదపవని, మేదరమెట్లపాలెం, భీమవరప్పాడు గ్రామాల ఆయకట్టు రైతులు ప్రాజెక్టు వద్దకు చేరుకుని దెబ్బతిన్న గేటు గురించి మెకానిక్ షమీం బాషాను అడిగారు. గేటు పైకి లాగేందుకు ప్రయత్నిస్తున్నానని, అది వచ్చేటట్టు లేదని ఆయన చెప్పారు. ముందు చేస్తామని చెప్పి, ఇప్పుడు వీలు పడదంటే ఎలా..? అని రైతులు ప్రశ్నించారు. నా చేతనైన మేరకు చేస్తున్నానని బాషా వారికి చెప్పారు. దీంతో 50 మందికిపైగా రైతులు ఆగ్రహావేశాలతో రోడ్డుపైకి వచ్చి మోటారు సైకిళ్లను అడ్డుపెట్టి ధర్నాకు దిగారు.



అత్మహత్యకు పాల్పడుతా...
ధర్నాలో పురుగు మందు డబ్బాతో రైతు

పంటలు ఎండుతున్నాయి.. ఆదుకోండి

ఇప్పటికే పోసిన వరినార్లు, నాటిన వరినాట్లు ఎండిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రాళ్లపాడు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని వారు నినాదాలు చేశారు.అధికారుల వైఫల్యం వల్లే ఇలా జరిగిందని వారు ఆరోపించారు.గత 9రోజుల క్రితం దెబ్బతిన్న గేటు వల్ల నీటి సరఫరా సరిగా జరక్క తాము తీవ్రంగా నష్టపోయా మని, ఆదుకోవాలని వారు కోరారు.ఈ సందర్భం గా ఓ రైతు మాట్లాడుతూ ఆయకట్టుకు వెంటనే నీరివ్వకుంటే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడతానని అధికారులను హెచ్చరించారు.

కుడికాలువపై అడ్డుకట్ట

మూడు రోజుల క్రితం గేటును కొద్దిగా పైకి లాగి 80 క్యూసెక్కుల నీటిని కాలువలోకి వది లారు. అయినా ఈ కాలువ దిగువన ఉన్న ఇసుకపాలెం వద్ద రైతులు నీరు దిగువకు వెళ్లకుండా కాలువకు అడ్డుకట్ట వేశారని రైతులు చెప్పారు.వారు ఆ నీటిని తమ పొలాలకు పెట్టుకుంటున్నారని తెలిపారు. దీంతో దిగువకు నీరు రాకపోవడంతో తమ పంటలు ఎండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నిలిచిన వాహనాల రాకపోకలు

ధర్నాతో లింగసముద్రం-కొత్తపేట మార్గంలో సుమారు నాలుగుగంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.విషయం తెలుసుకున్న వలేటివారిపాలెం, కందుకూరు, కొండాపురం ఎస్‌ఐలు,పోలీసు సిబ్బంది వాహనాలను వదలాలని రైతులకు నచ్చచెప్పినా వారు వినిపించుకోలేదు. సాయంత్రం 5.30 గంటలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కందుకూరు టీడీపీ నాయకులు గుర్రం మాల్యాద్రి, వడ్లమూడి సురేష్‌లు ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి గేటును పైకి లాగేందుకు ప్రయత్నించారు.అయితే గేటు పైకి లేవలేదు. గేటు లాగేందుకు తాము తెచ్చిన 14 టన్నుల గల పుల్లీల సామర్థ్యం చాలదని, 50 టన్నుల సామర్థ్యం కావాలని చెప్పి వారు వెళ్లిపోయారు. దీంతో రైతులు కూడా ధర్నాను విరమించారు. పోలీసులు సాయంత్రం 6 గంటలకు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



వేదగిరీశుడికి గరుడ సేవ

నెల్లూరు రూరల్, డిసెంబరు 15,(ఆంధ్రజ్యోతి) : మార్గశిర పౌర్ణమి పర్వడి సందర్భంగా వేదగిరి క్షేత్రంలో ఆదివారం లక్ష్మీనరసింహ స్వామి వారికి గరుడసేవ జరిగింది. ముందుగా విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనం పై ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీవారిని దర్శించుకున్నారు.



రంగడి ఆలయంలో కార్తీక పౌర్ణమి

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తమిళ క్యాలెండర్ తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఆలయంలో దీపారోపణ, లంకా దహనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామికి పేట ఉత్సవం జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు అర్పించారు. దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి, ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.



శాస్త్రోక్తంగా దేవదాయ శాఖ జిల్లా కార్యాలయం ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా కార్యాలయ నూతన భవనాన్ని ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా, ఘనంగా ప్రారంభించారు. రంగనాథస్వామి ఆలయ అనుబంధ సంస్థ అయిన ముప్పిరాల నరసింహాచార్యుల నిర్దిష్ట ధర్మాదాయం ద్వారా నెల్లూరులోని రంగనాయకులపేట చిత్రకూటంలో ఈ భవనాన్ని నిర్మించారు. దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, రంగనాథస్వామి ఆలయం ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ చైతన్య, వివిధ ఆలయాల ఈవోలు దేవుని పటాలు చేతబట్టి నూతన కార్యాలయంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా దివ్యప్రబంధ సేవా కాలం, వాస్తు హోమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం సుదర్శన హోమం, శ్రీయాగం జరుగుతాయని ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.





కాలువలో పడిన ట్రాక్టర్, మృతురాలు కామాక్షమ్మ (ఫైల్)

పెళ్లి ట్రాక్టరు బోల్తా

- ఒకరి మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు

అల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉడ్‌హౌస్‌పేట, తిప్పరోడ్డు మార్గంలోని అల్లిమడుగు చీలు రోడ్డు వద్ద శనివారం అర్ధరాత్రి పెళ్లి ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇస్కపల్లి అరుంధతీయవాడకు చెందిన కొనిదెల కామాక్షమ్మ (43) మరణించింది. మరో నలుగురు కె.రమేష్, ఎం.బాబు, కొండయ్య, శీనయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. మరో ముగ్గురు కుడుముల వరమ్మ, కావలి వెంకటరమ ణయ్య, జగ్గపూడి వెంకటేష్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మండల ఎస్‌ఐ కిషోర్‌బాబు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పరశు తిరపతయ్య, మంగమ్మల దంపతుల కుమార్తెను బోగోలు మండలం కొండబిట్రగుంట గ్రామానికి చెందిన వివాహం నిశ్చయించారు. అందులో భాగంగా ఆదివారం వివాహం కోసం స్వగ్రామం నుంచి ట్రాక్టరులో కుటుంబ సభ్యులు, బంధువులు సుమారు 20మంది పెళ్లి కుమారుడి స్వగ్రామానికి బయలుదేరారు. డ్రైవర్ అతివేగంతో ట్రాక్టరును నడపడటంతో అదుపుతప్పి రోడ్డు సమీపంలోని అల్లూరు బ్రాంచ్ కాలువలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనతో ట్రాక్టరులోని వధువు సహా అందరూ కాలువలో పడిపోయారు. డ్రైవర్ బాబు అక్కడి నుండి పరారీ అయ్యారు. కాలువలో పడినవారంతా ఒకరికొకరు సహకరించుకొని కాలువలో నుండి బయటకు వచ్చారు. అందులో కామాక్షమ్మ కనపడకపోవడంతో వెతికారు. చివరకి ఆమెకోసం కాలువలో చూడగా ట్రాక్టరు కింద పడిపోయి మృతిచెందడాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న తిప్ప పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అల్లూరు పరిధిలో జరిగిన సంఘటన కావడంతో అల్లూరు ఎస్‌ఐ కిషోర్‌బాబుకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని, గాయపడిన బాధితులను కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కామాక్షమ్మ ఇస్కపల్లి పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తుంది. పెళ్లికని వెళ్లిన కామాక్షమ్మ తిరిగారిన లోకాలకు వెళ్లడంతో కుటుంబసభ్యుల రోదన స్థానికులను కలచివేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రైల్లో నుంచి పడి యువకుడి మృతి

కోవూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇనమడుగు రైల్వే గేటు సమీపంలో ఆదివారం రైల్లో నుంచి పడి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. సిల్చార్ నుంచి తిరుచూరు వెళ్లే అరుణయ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్న అస్సాం రాష్ట్రంలోని గోవిందపూర్ ప్రాంతానికి చెందిన షాలే అహమ్మద్ (32) ప్రమాదవశాత్తు రైల్లో నుంచి కింద పడ్డాడు. దీంతో శరీరం రెండు ముక్కలుగా తెగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

- డ్రైవర్‌కి గాయాలు

కావలి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రుద్రకోట సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ జయ్‌బాల్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. జామాయిల్ లోడుతో నెల్లూరు వైపుకు వెళ్తున్న లారీని డ్రైవర్ రోడ్డు మార్జిన్‌లో నిలిపి బహిర్భూమికి వెళ్లాడు. ఈ సమయంలో ఒంగోలు నుండి చెన్నైకు గ్రానైట్‌లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ ముందు నిలిపి ఉన్న లారీని ఢీ కొంది. దీంతో జామాయిల్ కర్రతో ఉన్న లారీ రోడ్డు మార్జిన్ దిగి బోల్తాపడగా గ్రానైట్ లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. గాయపడిన డ్రైవర్ జయ్‌బాల్‌కు రక్తగాయాలవడంతో అతన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న గ్రానైట్ లారీ ముందుభాగం

ఏఎస్ పేటలో గుర్తుతెలియని మహిళ మృతి

ఏఎస్ పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గా సమీపంలో ఆదివారం గుర్తుతెలియని మహిళ మృతిచెందినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. వివరాల మేరకు.. సుమారు రెండు నెలల క్రితం 35సంవత్సరాల వయస్సు ఉన్న మహిళను వారి కుటుంబ సభ్యులు ఎవరికీ తెలియకుండా వదిలి వెళ్లారు. అప్పటి నుంచి ఆమె దర్గా ప్రాంగణంలో ఉం టోంది. ఈనేపథ్యంలో ఆదివారం ఉదయం ఆమె అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో దర్గా సిబ్బంది పోలీసులకు తెలపడంతో వారు పరిశీలించి కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. ఎవరైనా ఆమెను గుర్తిస్తే ఎస్‌ఐ ఫోన్ నెంబరుకు 9440700012 సమాచారం అందించాలని తెలిపారు.



మహిళ మృతదేహం

అదుపు తప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

- త్రుటిలో తప్పిన ప్రమాదం

రాపూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబులాయపల్లి జాతీయ రహదారిపై ఆదివారం ఓ కారు అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. రాపూరు నుంచి పెంచలకోన వైపు వెళ్తున్న కారుకు గేదె అడ్డురావడంతో తప్పించబోయే క్రమంలో కారు అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. కాగా, కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది.



ప్రమాదానికి గురైన కారు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	108
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	202
స్కిన్‌లెస్	222
లేయర్	178


బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7354
వెండి కిలో ధర	రూ. 91,800
వెండి ఒక గ్రాము	రూ.94.80

సోమశిలలో 72.809 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 4,126 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 72.809 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,050, కండలేరుకు 1,250, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 150 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

రేపే నుడా చైర్మన్ ప్రమాణ స్వీకారం

- హాజరుకానున్న మంత్రులు,ఎంపీలు, ఎమ్మెల్యేలు

నెల్లూరు(జడ్పీ), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకుగాను ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. కోటంరెడ్డి శ్రీనువాసులురెడ్డి రెండో దఫా నుడా చైర్మన్‌గా ఎన్నిక కావడంతో ఆయన ప్రమాణ స్వీకారానికి అధికా రులు, కోటంరెడ్డి అనుచరులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 9గంటలకు నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి నుడా కార్యాలయం వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం నుడా కార్యాలయ ఆవరణంలో సభ నిర్వహించి, అక్కడే ప్రమాణస్వీకారం చేయను న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితోపాటు జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లాకు చెందిన వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు హాజరుకానున్నారు.

నత్తనడకన ఈ క్రాప్ నమోదు

- ఫసల్‌బీమాలో అర్హతకు నెలాఖరు వరకు గడువు
- వ్యవసాయశాఖ ప్రత్యేక యాప్ రూపకల్పన
- తలలు పట్టుకుంటున్న వీఏఏలు



జలదంకిలో గత ఏడాది రబీలో సాగైన వరిపైరును ఈ క్రాప్‌లో నమోదు చేస్తున్న వీఏఏ (ఫైల్)

జలదంకి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గతంలో ఈ క్రాప్ నమోదును వ్యవసాయశాఖ సిబ్బంది ఆఫీసుల్లో కూర్చుని చేసేవారనేది జగమెరిగినసత్యం. దీంతో జామాయిల్, మామిడి చెట్లకు వడ్లు పండాయి. అంతేకాదండోయ్... ఈ క్రాప్‌లో వాగులు, వంకలు ఉన్న సర్వేనెంబర్లలో కూడా వరిసాగు అయినట్లు నమోదు చేశారు. ఇదంతా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కింద ధాన్యం అమ్మకాల్లో జరిగిన మతలబు. ఈ విషయమై విజిలెన్స్ విచారణలో బయటపడడంతో ఈ క్రాప్ నమోదును ప్రభుత్వం కఠినతరం చేసింది. ఇందులో భాగంగా వ్యవసాయశాఖ ఈ క్రాప్ నమోదుకు సాంకేతికత జోడించి ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారానే పంటనమోదు చేసేలా ఆదేశాలు ఇచ్చింది. ఈ యాప్‌లో ఈ క్రాప్ నమోదు అయితేనే ప్రభుత్వ రాయితీలు కానీ, పంటలబీమా పరిహారానికి కానీ అర్హులవుతారు.

● నెలాఖరు వరకు గడువు

ఇదిలా ఉండగా రబీలో వరిసాగు చేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)లో బీమా చేయాలంటే ఈనెలాఖరు వరకు ప్రభుత్వం గడువు ప్రకటించింది. బ్యాంకుల్లో పంటరుణం తీసుకున్న రైతులకు నేరుగా బ్యాంకులే పంటల బీమా చెల్లిస్తున్నారు. పంటరుణం పొందని రైతులు ఈనెలాఖరు లోపు కామన్ సర్వీస్ సెంటర్లలో వరిపైరుకు ఎకరానికి రూ.168 చెల్లించి పీఎంఎఫ్‌బీవైలో చేరాలని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటించారు. పంటరుణం లేని రైతులు సీఎస్‌ఎస్‌ల ద్వారా పంటబీమా చేయించుకోవాలంటే ఈ క్రాప్ నమోదు పత్రం తప్పనిసరి. దీంతో రుణం పొందని రైతులు తాము సాగుచేసిన వరిపైరును ఈ పంట నమోదు చేయాలని వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. ఈ నెలాఖరువరకే గడువు ఉండడంతో రైతులు ఎలాగైనా ఈ క్రాప్ నమోదు చేయాలని రైతుసేవాకేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.

● కొరకురాని కొయ్యలా...

క్షేత్రస్థాయిలోకి వెళ్లి యాప్‌లో ఈక్రాప్ నమోదు చేయాల్సి ఉండడంతో ఈ పరిస్థితి వీఏఏలకు కొరకురాని కొయ్యలా మారింది. పొలాల గట్ల మీదకు వెళ్తే కానీ ఈ క్రాప్‌నమోదు కాకుండడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో 'రేపు చేస్తాం... ఎల్లుండి చేస్తాం'... అని రైతులను వీఏఏలు తిప్పుకుంటున్నారు. సీఎంఆర్‌కు ధాన్యం అమ్మాలన్నా కూడా ఈక్రాప్‌లో నమోదై ఉంటేనే తప్ప వీలు కాని పరిస్థితి. ఈ క్రాప్ నమోదుకు ఇక పక్షంరోజులు మాత్రమే గడువు ఉండడంతో వీఏఏలపై రైతుల ఒత్తిడి అధికమైంది. ఇప్పటికి 10శాతం వరకు మాత్రమే జిల్లాలో సాగైన పంటలో ఈ క్రాప్ నమోదైనట్లు సమాచారం. జిల్లా వ్యవసాయ సంచాలకులు (జేడీఏ) స్పందించి యుద్ధప్రాతిపదికన వరి సాగు చేసిన పొలాలను ఈక్రాప్‌లో నమోదు చేయిస్తే తప్ప పంటరుణం పొందని రైతులకు బీమా పరిహారం అందదు. జిల్లాకలెక్టర్ కూడా ఈ క్రాప్ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

నేటి నుంచి కామాక్షితాయి దర్శన వేళల్లో మార్పు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం నుంచి 2025 జనవరి 15 వరకు దర్శనవేళలను మార్పు చేస్తున్నట్టు ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8గంటల వరకు, శుక్రవారం మాత్రం ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5.30నుంచి రాత్రి 9గంటల వరక భక్తులకు స్వామి,అమ్మవార్ల దర్శనం కల్పిస్తారని తెలిపారు. దర్శనవేళలను బట్టి శ్రీవార్ల ఆర్జిత సేవల సమయాలు మార్పులుంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

యాదవ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దామినబోయిన



వెంకటేశ్వర్లు

నెల్లూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : యాదవ ఎంప్లాయీస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన దామినబోయిన వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన సదస్సులో ఈ ఎన్నిక జరిగినట్లు ఆయన తెలిపారు. అన్నీ ప్రభుత్వ శాఖల్లోని యాదవ ఉద్యోగులను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారానికి పోరాడతామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు ఐక్యంగా పోరాడదాం

- సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య



ఎస్సీ వర్గీకరణ చేయాలని నినాదాలిస్తున్న మాదిగ సంఘాల జేఏసీ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ సంఘాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి పోరాటం సాగించాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ పిలుపునిచ్చారు. నెల్లూరులోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో మాదిగ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశం జరిగింది. సుబ్బయ్య మాట్లాడుతూ విబేదాలు వీడి ఎస్సీ వర్గీకరణ కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే 59 ఉపకులాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమిం చిన ఏకసభ్య కమిషన్‌కు అన్నీ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు లేఖలు ఇవ్వాలని కోరారు. అయితే వర్గీకరణ రాష్ట్రస్థాయిలో జరగాలని, జిల్లా స్థాయిలో జరిగితే జిల్లాలోని మాదిగలు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు గడ్డం శేఖర్. జనార్దన్ రావు, పల్లాల శ్రీనివాసులు, కుడుముల సుబ్బారావు, డేగా రాఘవేంద్ర, బద్దెపూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ రహిత నెల్లూరే లక్ష్యం : వీపీఆర్



జాబ్‌మేళాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లాను నిరుద్యోగ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డిప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో, వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరిగింది. ఈ మేళాను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో ప్రతి ఒక్కరికి వారి విద్యార్హతలకు తగ్గ ఉద్యోగం రావాలని కోరుకుంటున్నామన్నారు. మూడు నెలలకు ముందు నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు వెయ్యిమందికి ఉపాధి అవకాశాలు దక్కాయన్నారు. ఈ సారి 100కు పైగా ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు ఉద్యోగాలు ఇస్తున్న నేపథ్యంలో మరింత ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించే అవకాశం ఏర్పడిందన్నారు. ఉద్యోగాలు రాని యువతీ యువకులు నిరుత్సాహపడొద్దన్నారు. జాబ్‌మేళా నిరంతర ప్రక్రియ అని, ప్రతి మూడు నెలలకు ఒక సారి నిర్వహిస్తామన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా చేసే సామాజిక సేవలో భాగంగా నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేళా ద్వారా యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించి వారి కళ్లలో ఆనందం చూడాలన్నది ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆశయమన్నారు. టాటా స్కిల్ సెంటర్ వారు తమ స్కిల్ సెంటర్ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. మేళాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేమిరెడ్డి దంపతులు పరిశీలించి యువతతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అర్జున్‌రెడ్డి, నీలిమారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, బుచ్చి మున్సిపల్ చైర్పర్సన్ మోర్ల సుప్రజ, తెలుగుదేశం పార్టీ నాయకులు వంశీకృష్ణారెడ్డి, కమలాకర్‌రెడ్డి, గోల్డ్‌ఫీల్డ్ హెచ్‌ఆర్ హెడ్ వెంకట్ మాలేపాటి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న సీపీఎం నేతలు

కరెంట్ బిల్లుల పెంపును నిరసిస్తూ సీపీఎం ఆందోళన

కావలి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన కరెంట్ బిల్లులను నిరసిస్తూ ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం బ్రిడ్జి కూడలి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు కరెంట్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య మాట్లాడారు. పెంచిన కరెంట్ చార్జీలు వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలో వచ్చినాక కరెంట్ బిల్లులు పెంచమని వాగ్దానం చేసిన సీఎం చంద్రబాబు మాట తప్పారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల ముసుగులో ప్రజలను దోచుకునేందుకు సిద్ధపడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తిరుపాల్, కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, కృష్ణయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు మల్లికార్జున ఎంపిక



పతకం, ప్రశంసాపత్రం అందుకుంటున్న మల్లికార్జున

మనుబోలు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 14, 15 తేదీలలో జరిగిన 44వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చాటిన మనుబోలు మండలపరిషత్ కార్యాలయంలో బోర్ మెకానిక్ పోతుగుంట మల్లికార్జున జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యాడు. వచ్చేఏడాది ఫిబ్రవరి 6,7తేదీలలో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపి యన్‌షిప్ పోటీల్లో పాల్గొంటాడు. ఈ సందర్భంగా మల్లికార్జునను పలువురు అధికారులు అభినందించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉదయగిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కటారి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలో మద్యపాన నిషేధం వల్ల కుటుంబాలు బాగుపడ్డాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీధికో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తోందని, దీంతో పేదలు మద్యానికి బానిసలవుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తే పగలగొట్టాలని లోకేష్ పాదయాత్రలో పేర్కొన్నాడని, ప్రస్తుతం విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచడంతో గతంలో రూ.200 వచ్చే బిల్లు ప్రస్తుతం రూ.400 అయ్యిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. పేరుకే ఉచిత ఇసుకన్నారు. ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో నెల్లూరులో నిర్వహించే ఆంధ్ర రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నేతలు కాకు వెంకటయ్య, కోడె రమ ణయ్య, ఫరుద్దీన్‌బాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కావలి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పాలిట ఆపద్బాంధవుడు చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముసునూరు రైల్వేగేట్ సమీపంలోని మైదానంలో దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా జరిగింది. హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీడీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మండవ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగుల అభివృద్ధి సంక్షేమానికి కట్టుబడి వున్నారని తెలిపారు. దివ్యాంగులందరికీ నివాసాలు కల్పించేలా తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గృహాలు నిర్మించుకునే వారికి రూ.10వేలు అందజేస్తానని తెలిపారు. మండవ వెంకట్రావు పోరాట పటిమ గొప్పదని ఆయన దివ్యాంగులకు అందించిన సేవలను కొనియాడి సత్కరించారు. కార్యక్రమంలో వేదిక నాయకులు మహబూబ్‌బాష, సోమయ్య, శ్రీను సలహాదారుడు నటరాజ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

అల్లూరు : రోడ్డు ప్రమాదంలో మరణించిన నార్తుఆములూరు టీడీపీ నాయకుడు శిగినం తిరుపతి కుటుంబసభ్యులను ఆదివారం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, ఊటు అశోక్‌రెడ్డి, గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్, కరుణాకర్, పెయ్యల బాస్కర్, బాబు, గుంజి మల్లికార్జున, ఎందేటి హరికృష్ణ యాదవ్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'చలో గుంటూరు'కు మాల మహానాడు శ్రేణులు


కావలి టౌన్: గుంటూరుకు బయలుదేరుతున్న మాల మహానాడు కార్యకర్తలు

కావలి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా గుంటూరులో తలపెట్టిన హలో మాల- చలో గుంటూరు కార్యక్రమానికి ఆదివారం కావలి నుంచి మాలమహానాడు ఆధ్వర్యంలో సభ్యులు పెద్దఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో మాలమహానాడు డివిజన్ అధ్యక్షులు ఎల్లంటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మేడికొండ సుకుమార్, మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఆనందరావు ఉన్నారు.

● జలదంకి : గుంటూరులో ఆదివారం నిర్వహిస్తున్న మాలల సింహగర్జనకు మండలంలోని మాల కులస్థులు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. ముందుగా వీరు జమ్మలపాలెం నుండి 400మంది ర్యాలీగా ముందుకు వెళుతుండగా అనంతరం మాజీసర్పంచ్ నక్కా మాధవరావు వాహనాలకు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఉలవపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ అలగాయపాలెం కొత్తరెడ్డిపాలెంలోని ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టకు ఆదివారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎంపీ, ఎమ్మెల్యేలకు సాదర స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఉలవపాడు నుంచి అలగాయపాలెం వచ్చే రోడ్డు వద్ద రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ఉలవపాడు రైల్వే స్టేషన్‌లో సూపర్ ఫాస్ట్‌లు నిలిపేలా కృషి చేయాలని ప్రజలు ఎంపీ వేమిరెడ్డికి విన్నపించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్నకు వైభవంగా గరుడసేవ


గరుడ వాహనంపై ఆశీనుడైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి

బిట్రగుంట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆదివారం రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. కావలి బులియన్ మార్కెట్ అధ్యక్షులు మొగలపల్లిరాజు, మిత్రబృందం ఉభయ కర్తలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ చార్యులు, కళ్యాణాచార్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సేవను తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, మాజీ పాలక మండలి సభ్యులు తులసీరాం, ఆలయ సిబ్బంది ఉన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

రాజరాజేశ్వరిదేవి ఆలయంలో పౌర్ణమి పూజలు


హోమంలో పూర్ణాహుతి వేస్తున్న అర్చకులు

సంగం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండలో ఉన్న శ్రీ రాజ రాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మ వార్లకు లలిత క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం హోమం ఏర్పాటుచేసి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


కావలి: పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కూటమి, ఆర్యవైశ్య నేతలు


కందుకూరు : పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి, తదితరులు

తెలుగువారి ఆత్మగౌరవం పొట్టి శ్రీరాములు

● జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు పొట్టి శ్రీరాములు పేరు ప్రతిపాదన ● ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవం కోసం పోరాడిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఆయన ఆత్మత్యాగం, బలిదానం ఫలితంగా ప్రత్యేక రాష్ట్ర గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పట్టణ ట్రంకు రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు తటవర్తి రమేష్‌తో పాటు సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ఆత్మార్పణ దినం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరజీవి వర్ధంతిని పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినంగా ప్రకటించి ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు పొట్టిశ్రీరాములు పేరుపెట్టాలనే ప్రతిపాదనను త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. అలాగే కావలి ట్రంకురోడ్డుకు మాగుంట పార్వతమ్మ పేరుతో త్వరలో జీవో రానుందన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోట్లూరు శ్రీనివాసులు, మొగిలి కల్లయ్య, బీజేపీ నాయకులు కందుకురి వెంకట సత్యనారాయణ, సీవీసీ సత్యం, బహ్మానందం, జనసేన నేతలు అళహరి సుధాకర్, పొబ్బా సాయి విఠల్, ఏరియా వైద్యశాల డైరెక్టర్ చవల రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: జువ్వలదిన్నెలోని ఆయన స్మారక భవనంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోగోలు మండల తహసీల్దారు సురేష్‌బాబు, కార్యదర్శి పురిణి శ్రీనివాసులు, పొట్టిశ్రీరాములు కమిటీ అధ్యక్షులు తిరువీధి ప్రకాశరావు, సభ్యులు ఎం.నాగేశ్వరావు, పసుమర్తి నాగరాజు ఉన్నారు. అనంతరం పర్యాటక కేంద్ర ఆవరణలోని పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహానికి ఇస్కపల్లి కెనాల్ అధ్యక్షులు బీద గిరిధర్‌యాదవ్, జువ్వలదిన్నె చెరువు అధ్యక్షులు కోటా వెంకారెడ్డి, ఉపాధ్యక్షులు పులికొండలరావు, టీడీపీ నేతలు బడుగు వెంకయ్య, గునిమిని రవికుమార్‌రెడ్డి, కడియాల చిన గోవిందులు పూలమాలు వేసి నివాళులర్పించారు.

●అల్లూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం డీటీ ప్రవీణ్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్వో భారతి, సర్వేయర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

● కందుకూరు : నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు, గుడ్లూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినంగా ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి నియోజకవర్గం ప్రజల తరుపున దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, ఆర్యవైశ్య నాయకులు తాతా లక్ష్మీనారాయణ, మురారిశెట్టి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●ఉలవపాడు : ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలను ఆత్మార్పణ చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములును స్మరించుకోవడం తెలుగుజాతి గర్వించదగిన అంశమని ఆర్యవైశ్య మండల అధ్యక్షులు పోకూరి శ్రీధర్ అన్నారు. ఆదివారం ఉలవపాడు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాపనపల్లి సుబ్రహ్మణ్యం, పైడిమర్రి సత్యన్నారాయణ, మేడా శ్రీనివాసులు, రామాంజేయులు పాల్గొన్నారు.

●ఆత్మకూరు: అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్‌ఛైర్మన్ షేక్ సర్దార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కేతా విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, షేక్ గౌస్‌బాష, గండళ్ల వేణు, టీడీపీ నేతలు కొప్పోలు చిన్నపురెడ్డి, మున్సిపల్ ఏఈ డి మాధవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఉప రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐ రాములు, సిబ్బంది, పలువురు వాహనదారులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సత్రంసెంటర్ వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి పలువురు ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర అవతరణ కోసం పొట్టిశ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు.

● సంగం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గిరి, రాజ, వేమూ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

● చేజర్ల : మండల కేంద్రమైన చేజర్లలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. బస్టాండులో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పువ్వాడి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నేత రావి పెంచలరెడ్డి, బీజేపీ నేత బత్తల కిష్టయ్యలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రావు, సుధాకర్, దేవతి సుబ్బారావ పాల్గొన్నారు.

● ఉదయగిరి : పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి, అధ్యాపకులు రమేష్, దుర్గాప్రసాద్, గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, కిషన్‌తేజ, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు: మున్సిపల్ కార్యాలయంలో పొట్టిశ్రీరాముల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నేతలు


ఉదయగిరి: పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నేడు గంధ మహోత్సవం


గంధ మహోత్సవానికి ముస్తాబైన దర్గా

ఉదయగిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న దుర్వేష్‌ఔలియా గంధ మహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దర్గా నుంచి బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో గంధం ఊరేగింపు చేపట్టి తిరిగి దర్గాకు చేరుతుందన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు పంచిపెట్టడం జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కోల్డ్ స్టోరేజ్ ప్రారంభం


కోల్డ్ స్టోరేజ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కాకర్ల, ఉగ్ర

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన కోల్డ్ స్టోరేజ్‌ను ఆదివారం ఉదయగిరి, కనిగిరి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఉగ్ర నరసింహరెడ్డిలు ప్రారంభించారు. ఈసందర్భంగా కాకర్ల మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో ఇలాంటి అవకాశం కల్పించడం అభినందనీయమని, ఈప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2047 విజన్‌తో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కురిసిన వర్షాల నేపథ్యంలో నియోజకవర్గంలోని చెరువులు నిండి రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు తాను ముందుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

19న ఉప్పలపాడు నల్లచెరువుకు బహిరంగ వేలం

అనంతసాగరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో గల నల్లచెరువుకు ఈనెల 19న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ పూరిబిండి ప్రశాంతి, పంచాయతీ కార్యదర్శి పి అరుణ్‌కుమార్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 1434 ఫసలి ప్రకారం వేలంపాటలో పాల్గొనేవారు రూ. 10000 చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఉప్పలపాడు సచివాలయంలో వేలంపాట జరుగుతుందని తెలిపారు.

మృత్యుకుహారంలా సంగం - పల్లిపాళెం రహదారి

● కాలువ తూములు కుంగి గుంతలు ● ప్రమాదకరంగా మలుపులు ● వాహనదారుల అవస్థలు


కాలువ రక్షణ గోడ దెబ్బతిని కోతకు గురైన పల్లిపాళెం రహదారి


రోడ్డుపై రాకపోకలకు తాత్కాలికంగా వేసిన ఇసుక బస్తాలు

సంగం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగం - పల్లిపాళెం రహదారి మృత్యుకుహారంగా మారింది. ఈ రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా గత వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకున్న నాథుడే లేడని ప్రజలు, వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంగం ఇరిగేషన్ ఆనకట్ట నుంచి నెల్లూరు - ముంబయి రహదారికి సమాంతరంగా పల్లెపాళెం మీదుగా బైపాస్ రహదారి ఉంది. ఈ రోడ్డు గాంధీజన సంఘం వద్ద నెల్లూరు జాతీయ రహదారిలో కలుస్తుంది. పొదలకూరు, చేజర్ల నుంచి బుచ్చి వైపు వెళ్లే వాహనదారులకు ఈ రోడ్డు బైపాస్ రోడ్డుగా ఉంది. ఈ రహదారి పంచాయతీరాజ్ ప్రాజెక్టు పరిధిలో ఉంది. మండల కేంద్రానికి తూర్పు వైపున ఉన్న గ్రామాలు వెంగారెడ్డిపాళెం, పడమటిపాలెం, గాంధీజనసంఘం, సిద్దీపురం, దువ్వూరు గ్రామాలకు సంగం వచ్చేందుకు బైపాస్ రహదారిగా ఉపయోగపడుతోంది. లారీలు, బస్సుల రాకపోకలతో ముంబయి రహదారి రద్దీగా ఉండడంతో ఆత్మకూరు, పొదలకూరు వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులు, అదేవిధంగా పొదలకూరు, ఆత్మకూరు, సంగం నుంచి బుచ్చి వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులు, కార్లు పల్లిపాళెం బైపాస్ రహదారి మీద రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంది. దీంతో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు బైపాస్ రహదారి మీదనే రాకపోకలు సాగిస్తున్నారు.

● కుంగిన కాలువ తూములు

ఈ రహదారి నిర్మించి పదేళ్లు కావడం, గత వైసీపీ ప్రభుత్వం నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో ఈ రహదారిలో ఉండే పలు కాలువల తూములు కుంగి గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఓ ఆటో ఈ గుంతల్లో పడి అదుపుతప్పి కాలువలో పడింది. కాలువలో తక్కువ పరిమాణంలో నీరు ఉండడంతో ప్రమాదం తప్పింది.

● ప్రమాదకరంగా మలుపులు

రహదారిలోని పలు కాలువలపైన ఉన్న రక్షణ గోడలు దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నాయి. ఐదు కిలోమీటర్ల ఈ రహదారిలో 8 చోట్ల ఎస్ ఆకారంలో ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల్లో సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు వేగంగా వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

● అప్పాజీ, ఎంపీడీవో, ఉదయగిరి



ఉదయగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంతో పాటు మండలంలో 17 పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో అప్పాజీ ఆదివారం తెలిపారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తున్నామని, చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నామన్నారు.

ఈ ఇంటర్వ్యూ

? వాటర్‌ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారా.

!: వాటర్‌ట్యాంకుల్లో ప్రతి 15 రోజులకోసారి క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నాం.

? హౌస్‌హోల్డ్ సర్వే పూర్తయిందా.

! మండలంలో హౌస్‌హోల్డ్ సర్వే దాదాపు పూర్తయింది. ఈ సర్వే ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయి.

? చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొస్తారా.

! మండలంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతాం. ఇప్పటికే పలు పంచాయతీల్లో కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొచ్చాం.

న్యూస్ బాక్స్

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

సీతారామపురం,డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామ పంచాయతీలోని ఎసి నగర్ యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా టీడీపీ నాయకులు గోవిందు నాగయ్య, గోవిందు రత్నం సహకారంతో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం మాజీ జడ్పీటీసీ కల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, బసినేనిపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ బద్వేల్ రమణారెడ్డిలు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం కల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి బోలింగ్ వేయగా బద్వేల్ రమణారెడ్డి బ్యాటింగ్ చేస్తూ క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమిలిపొగు ఏసుదాస్, మౌలయ్య, మాలకొండయ్య, ఆర్గనైజింగ్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంపై అవగాహన ర్యాలీ

వింజమూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ శైలజ పాల్గొని జీవుడు, దేవుడు, భగవంతుడు గూర్చి చక్కటి ఉదాహరణలతో శాస్త్రీయంగా వివరించారు. ఈ నెల 21 నుంచి 31 వరకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో జరుగు పత్రీజీ ధ్యాన మహాయాగానికి అందరూ హాజరు కావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం శాకాహారం గొప్పతనం గురించి కరపత్రాలు పంచుతూ పిరమిడ్ నగర్, చెన్నకేశవస్వామి బజార్, ఎర్రబెల్లిపాలెం, ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి పిరమిడ్ మాస్టర్ లింగారెడ్డి, ధ్యానులు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న లావణ్య

చిన్నారులకు దుస్తుల పంపిణీ

కావలి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కచ్చేరిమిట్టలో ఆదివారం మీకోసం సేవాసంస్థ సభ్యులు బ్లెస్డ్ హోమ్ పిల్లలకు క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు దిలీప్, దాసు, డేనియల్ బాబ్జి, అడ్వకేట్ శివకృష్ణ, అంకప నాయుడు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరలు..


చీరలు అందజేస్తున్న ప్రభాకర్

గుడ్లూరు, డిసెంబరు 15: మూర్తింపేట గిరిజనకాలనీని 50మంది పేద కుటుంబాలకు ఆదివారం పీపుల్ హెల్పింగ్ హాండ్స్ సొసైటీ సభ్యులు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తలకాయల ప్రభాకర్, హేమలత, మాదేష్, సంజయ్ గ్రామపెద్దలు ఉన్నారు.

ఆటో కార్మికుల సభ్యత్వ నమోదు

ముత్తుకూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆటో కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ముత్తుకూరు, పిడతాపోలూరు కూడలి, పంటపాలెంలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుబోయిన రాజా, కొల గట్ల సురేష్ మాట్లాడుతూ ఉన్నతమైన చదువులు చదువుకొని ఉద్యోగాలు, ఉపాధి లేక ప్రభు త్వాల మీద ఆధారపడకుండా ఆటో కార్మికులుగా జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు, ఆర్టీఏ ఫైనాన్స్ సిబ్బంది వేధింపులు అధికమవుతున్నాయన్నారు. ఈ రంగం మీద ఆధారపడి జీవించే ఆటో, ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీఐటీయూ నాయకుడు గడ్డం అంకయ్య, ముత్తుకూరు ఆటోస్టాండ్ అధ్యక్షుడు విజయ్, వావిళ్ల వెంకయ్య, బెల్లంకొండ సురేష్, పోలయ్య, సీతారా మయ్య, ఏడుకొండలు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరులో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

సోమిరెడ్డిని కలిసిన నీటి సంఘాల అధ్యక్షులు

తోటపల్లిగూడూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లుగా ఎన్నికైన వారు అల్లీపురంలోని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రైతులకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సోమిరెడ్డి మాట్లాడుతూ సాగునీటి సంఘాల ప్రతినిధులు ప్రతి ఒక్కరూ రైతులకు అందుబాటులో ఉండి సాగునీటి యాజమాన్యాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. సాగునీటి పంపిణీని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రావూరి మల్లికార్జున ప్రసాద్‌చౌదరి, చింత సీతారామయ్య, గుడ్లూరు గోపాలనాయుడు, బొమ్మి కిరణ్, టీడీపీ నాయకులు మన్నెం జితేంద్ర, మధుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అడుక్కో గుంత ఆపై బురద

కట్టుబడిపాళెంలో పెద్ద గోతులు, బురదతో రోడ్డు



- దుస్థితిలో రహదారులు..!
- అవస్థల్లో ప్రజలు, వాహన చోదకులు
- బుచ్చి-దగదర్తి రోడ్డుపై ప్రయాణం నరకం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఈ రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా మారడంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. బుచ్చిరెడ్డిపాళెం నుంచి దగదర్తి రోడ్డు అడుగడుగున గుంతలతో దుస్థితిలో ఉంది. బుచ్చి పెద్దూరు దళితవాడ, కట్టుబడిపాళెం, రామచంద్రాపురం, మునులపూడి, రెడ్డిపాళెం ఆదుగా దగదర్తి వరకు రోడ్డుపై 1 నుంచి 2 అడుగుల మేరకు గోతులు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో ఆ గోతుల్లో నీరు నిలిచి వాహన చోదకులకు ఎక్కడ గుంతో, ఎక్కడ మిట్టో తెలియక ప్రమాదాలకు గురువతున్నారు.


రామచంద్రాపురంలో గోతులు..

● రూ.39 కోట్ల ఏమయ్యాయి?

కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా 3 ఏళ్ల క్రితం బుచ్చి నుంచి దగదర్తి వరకు పాతరోడ్డు తీసేసి కొత్తగా డబుల్ రోడ్డు వేసేందుకు 22 కిలోమీటర్లకు ఎన్‌డీబీ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు), (ఏపీఎంసీఆర్‌ఐసీఐపీ)ల నుంచి రూ.39 కోట్లు మంజూరయ్యాయని వైసీపీ నేతలు ప్రకటించారు. ఆ నిధులతో తక్షణం పనులు చేపడుతామంటూ ఉన్న కాస్త అతుకులు, గతుకుల రోడ్డు కూడా లేకుండా సైడు మార్జిన్లు, రోడ్డును అక్కడక్కడా తవ్వేసి ధ్వంసం చేశారు. అయితే 3 ఏళ్లు గడిచినా అడుగు కూడా ముందుకుపడక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. మార్గమధ్యంలోని గ్రామాల్లో ఈ నిధులతో సీసీ రోడ్లు కూడా నిర్మించాల్సి ఉంది. దీంతో ఆ నిధులు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీంతో ప్రస్తుతతం ఆ మార్గంలో. సైడు మార్జిన్లు కూడా లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

● సీసీ రోడ్డు లేనట్టే.?

బుచ్చి నుంచి దగదర్తి మధ్యలో బుచ్చి మండలంలోని రామచంద్రాపురం గ్రామంతోపాటు కట్టుబడిపాళెం, ఇందిర ప్రభకాలనీ, శ్రీపురంధరపురం, మునులపూడి గ్రామాల పరిధిలో సీసీ రోడ్ల ఊసే లేదు. మలిదేవి బ్రిడ్జి నిర్మాణానికి కూడా గ్రహణం పట్టింది. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ నాగరాజును వివరణకోరగా పనులు మొదలయ్యాయని మరో 3 నెలల్లో రోడ్డు పూర్తవుతుందని తెలిపారు. ఐతే పలు గ్రామాల్లో సీసీ రోడ్లు వేసేందుకు నిధులు చాలవని తెలిపారు.

అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు వేయాలి - ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చి, దగదర్తి మార్గంలో బుచ్చి మండల పరిధిలోని అన్ని గ్రామాలకు నిధులు సర్దుబాటు చేసి సీసీ రోడ్డు వేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఇంకా అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు.

మూడేళ్లుగా అల్లాడుతున్నాం

మూడేళ్లుగా అధ్వాన్నంగా ఉన్న రోడ్డుతో అల్లాడుతున్నాం. ఉన్న రోడ్డును తవ్వేసి గుంతలు చేసిపెట్టారు, బుచికి పోవాలంటేనే ఒళ్లు ఊనం అవుతోందని భయపడుతున్నాం. చినుకుపడితే చిత్తడి అవుతున్న ఈ రోడ్డుపై స్కూలు బస్సులు, పిల్లలు, నిత్యం వందలాది వాహనాలు తిరుతుంటాయి. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేసి కాపాడాలి.



- ఆదిలక్ష్మి, రామచంద్రాపురం

అమరజీవి మార్గం అనుసరణీయం

- వాడవాడలా ఆత్మార్పణ దినం
- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, నగర మేయర్ నివాళి


పొట్టి శ్రీరాములకు నివాళులర్పించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మార్పణం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం బుచ్చిరెడ్డిపాళెంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తన కుమారుడు అర్జున్‌రెడ్డి, బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, స్థానిక ఆర్యవైశ్యులుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. తెలుగుభాష మాట్లాడేవారంతా ఒక రాష్ట్రంలో ఉండాలని పోరాడారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాధా కృష్ణయ్య, హరనాథ్, బాలనరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి మార్గాన్ని అనుసరించాలి : ఆర్ఐవో

నెల్లూరు(విద్య,ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు మార్గాన్ని యువత అనుసరించాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు సూచించారు. నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఆదివారం ఆత్మార్పణ దినం నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐవో మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీరాములు తెలుగు ప్రజల గుండె ల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు తెలియచేసి ఆయన బాటలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల పోటీ ఆకట్టుకుంది. విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమం లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, అధ్యాపకులు డాక్టర్ వెంకట్రావు, భారతి, ఎన్ఎస్ఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు


పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నేతలు

సంకల్పం కోసం ప్రాణత్యాగం

పొదలకూరు,(ఆంధ్రజ్యోతి): సంకల్పం కోసం ప్రాణ త్యాగం చేసిన ఏకైక వ్యక్తి అమరజీవి పొట్టిశ్రీరాములు అని నెల్లూరు రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ పొట్టి సుధాకర్ అన్నారు. పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినంలో భాగంగా ఆదివారం స్థానిక పంచాయతీ బస్టాండ్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆత్మార్పణ చేసిన పొట్టిశ్రీరాములు సేవలు నిరుపమానమని, ఆయనను భావితరాలు గుర్తించుకోవాలన్నారు. తాను చనిపోయినా పర్వాలేదంటూ తెలుగు వారికోసం ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. కులమతాలకు అతీతంగా పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆకులూరు విజయ్, పిన్నెల ప్రభాకర్, మణిస్వామి, డాక్టర్ జె.బ్రహ్మయ్య, తన్నీరు సురేష్‌బాబు, గుర్రం మీరామదు, పైడా కామేశ్వరరావు, అనిల్‌కుమార్‌రెడ్డి, సురేంద్ర, ఆదూరు సుబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అమరజీవి


అమరజీవికి నివాళి అర్పిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి): తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న లక్ష్యంతో అహింసా మార్గంలో ప్రాణార్ప ణతో స్ఫూర్తిగా నిలిచిన పొట్టిశ్రీరాములు అందరికి ఆదర్శప్రా యుడని నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజ అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆత్మార్పణ దినం నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ఆవతరణకు ఆయ న ప్రాణ త్యాగమే కారణమన్నారు. అస్పృశ్యతా నివారణ, ఆలయా ల్లోకి దళితుల ప్రవేశం వంటి ఉద్యమాలతో నిమ్న వర్గాల అభ్యు న్నతికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ ఇనయతుల్లా, కార్పొరేటర్ సత్తార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఆశాజ్యోతి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట,ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలు గు ప్రజల ఆశాజ్యోతి అని, ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్క రు కృషి చేయాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గును కుల కిషోర్, నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ కోరారు. అమరజీవి వర్ధంతి సందర్భంగా నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి జనసేన పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కారంపూడి కృష్ణారెడ్డి, ప్రశాంత్ గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, మనోజ్ కేదారి, గుర్రం కిషోర్, ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న జన సేన నాయకులు

ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో....


ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో నివాళులర్పిస్తున్న ఈవో

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి): నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆలయ ఈవో వీ గిరికృష్ణ పుష్పమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేశారని, అంతకుముందు నిరాహార దీక్షల ద్వారా దళితులకు ఆలయ ప్రవేశం కల్పించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహనీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చకుడు పీ చంద్రశేఖర్, అర్చకుడు జయస్వామి, కోవూరు గ్రూపు ఆలయాల కార్యనిర్వహణాధికారి సీహెచ్ కృష్ణప్రసాద్, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో...


గాంధీ ఆశ్రమంలో నివాళులు అర్పిస్తున్న నిర్వాహకులు

ఇందుకూరుపేట,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్‌పటేల్, అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి కార్యక్రమాలు అనంతరం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి, ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. సర్దార్ వల్లబాయిపటేల్, పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా ర్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బలిదానం వల్లే...


మూలాపేటలో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మబలిదానం వల్లనే దేశంలో భాషా ప్రయోక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని బీజేపీ నాయకుడు మిడితల రమేష్ అన్నారు. ఆదివారం మూలాపేటలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టిశ్రీరా ములు త్యాగాలను స్మరించుకున్నారు. మూలాపేట మండల బీజేపీ అధ్యక్షుడు అల్లూరు నాగేంద్రసింగ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కందికట్టు రాజేశ్వరి, నరేష్, సరస్వతీ, వీ ఉమామహేశ్వరరావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు పెన్షనర్ల దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10గంటలకు భక్తవత్సలనగర్ పెన్షన్ భవనంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవం నిర్వహిస్తు న్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన పెన్షనర్లను సత్కరిస్తామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పెన్షనర్లు, కమిటీ సభ్యులు, ఆఫీసుబేరర్లు హాజరుకావాలని కోరారు.

శ్రీరంగం పరవకోటై అణ్ణవీన్ స్వామిరాక

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగం పవరకోటై అణ్ణవీన్ స్వామి ధర్మప్రచార, ధనుర్మాస యాత్రలో భాగంగా ఆదివారం నగరంలోని రంగనాయకులపేట వేదాంత దేశికర్ ఆలయానికి విచ్చేశారు. ఉదయం పూజలు నిర్వహించి, సాయంత్రం తిరుప్పావై ప్రవచ నం చేశారు. సోమవారం నుంచి 2025 జనవరి 6వతేదీ వరకు ప్రతీరోజు సాయంత్రం 6.30 గంటలకు తిరుప్పావై ప్రవచనం చేస్తారని దేవస్థానం కమిటీ పేర్కొంది.

కమిషనర్‌కు జనసేన అభినందనలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద ఆదివారం మిట్ట మధ్యాహ్నం నడిరోడ్డుపై ఫ్లెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్ సూర్యతేజకు జనసేన పార్టీ నాయ కులు అభినందనలు తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ అందరూ కమిషనర్‌ను ఆదర్శంగా తీసుకొని నగరాభివృద్ధికి శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కనీస అవసరాలు తీర్చడమే లక్ష్యం : గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, డిసెంబరు 15,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పేదలు నివసించే ప్రాంతాల్లో కనీస సదుపాయాలు కల్పిం చడమే తమ ముందున్న లక్ష్యమని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం 41వ డివిజన్‌లోని అరుంధతీపాళెంలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

సత్యనారాయణ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఆలయ అర్చకుడు బీ శ్రీనివా సాచార్యులు భక్తులతో వ్రతం చేయించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

స్టేడియం వాకర్స్ సంఘం కమిటీ ఎంపిక

నెల్లూరు(విద్య), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా పోతోలు వెంకట సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా వింజం రామానాయుడు, కార్యదర్శిగా తుమ్మలపెంట సురేష్, కోశాధికారిగా గాలి రఘురామయ్య నాయుడు ఎంపికయ్యారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేపట్టి సంఘం ఉన్నతికి పాటుపడతామని నూతన కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ ఎన్నికలను అసోసియేషన్ సీనియర్ నేతలు కిలారి తిరుపతి నాయుడు, వేలూరు రంగారావు, బాశం శేషగిరిరావు తదితరులు పర్యవేక్షించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ముత్తుకూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సెపక్ తక్ర జాతీయ స్థాయి పోటీలకు వీబీఆర్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థి ఉదయ్ కుమార్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఆదివారం సన్మానించి అభినందనలు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో తమ విద్యా సంస్థల చైర్మన్ ఊటుకూరు శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ శైలజారెడ్డి ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాము, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రకాష్, కరాటే మాస్టర్ దనుష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట పంచాయతీ పవన్ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... నెల్లూరు నగరంలోని పద్మావతి సెంటర్ ప్రాంతానికి చెందిన సుబ్రహ్మణ్యం పని నిమిత్తం మోటర్‌బైక్‌పై గూడూరుకు వెళ్లి తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా పవన్ కాలనీ సమీపంలోకి వచ్చేసరికి రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌లో పచ్చగడ్డి మేస్తున్న ఆవులు ఒక్కసారిగా రహదారిపైకి దూసుకురావడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో సుబ్రహ్మణ్యం చేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందులు కొంటేనే యూరియా!?

తోటపల్లిగూడూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకూరు సెంటర్‌లో మూడు ఎరువుల దుకాణాలు ఉన్నాయి. రైతులు యూరియా కోసం ఆ దుకాణాలకు వెళితే రసాయనిక (పురుగు) మందులు కొంటేనే యూరియా ఇస్తామని, లేకుంటే లేదని తెగేసి చెబుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదే మిటని ప్రశ్నిస్తే మాకు పైనుంచి ఆదేశాలు వచ్చాయని ఎరువుల దుకాణాల యజమానులు అంటున్నారని రైతులు వాపోతున్నారు. ఆదివారం ఓ రైతు నరుకూరు సెంటర్‌లో ఉన్న ఓ ఫెర్టిలైజర్స్ దుకాణానికి వెళ్లి యూరియా ఇవ్వమని కోరగా రసాయనిక మందులు కొన్నవారికే యూరియా ఇవ్వమని మాకు కంపెనీల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారని రైతు తెలిపాడు. దీంతో అవసరం లేని పురుగు మందుకొని ఏమి చేసుకుంటామని ఆ రైతు వారిని ప్రశ్నించగా దానితో తమకు సంబంధం లేదన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. అయితే కొందరు ముఖ్యమైనవారికి, రాజకీయ పలుకుబడి కలిగిన వారికి ఎరువులు ఇస్తున్నారే తప్ప సామాన్య రైతులకు అందే పరిస్థితులులేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఎమ్మార్పీ కంటే అధిక ధరకు యూరియా విక్రయిస్తున్నారని రైతులు తెలిపారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

కోవూరు, డిసెంబరు 15, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కరమే లక్ష్యంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నిరంతర పోరాటం సాగిస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన కోవూరు డివిజన్ మొదటి మహాసభలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థను ప్రయివేటు పరం కాకుండా పోరాటం చేస్తున్నామన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి సుధాకర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో డివిజన్ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్ సురేంద్ర, నెల్లూరు దయాకర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు షేక్ సాహుల్, పట్టపు రామయ్య తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న సూరిబాబు

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి : ఎమ్మెల్సీ

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు కోరారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యాసదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యూటీఎఫ్ కార్యకర్తలంతా వ్యక్తిగత,సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు. తొలుత వీఆర్‌సీ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో సీనియర్ నేతలను, ఉపాధ్యాయులను సత్కరించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు ఎన్.వెంకటేశ్వర్లు, ఎన్.నవకోటేశ్వరావు, వీవీ.శేషులు, చలపతిశర్మ, కిలారి వెంకటేశ్వర్లు, ఎంసీ.అచ్చయ్య, మురళీధర్ రావు, డీ మస్తాన్‌రావు, కే పరంధామయ్య, సీహెచ్.శ్రీహరి, సుబ్బారావు, ఎంవీ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో 'నారాయణ'కు ఉత్తమ ర్యాంకులు


నీట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో విజయభాస్కర్‌రెడ్డి

- విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నీట్-2024లో జాతీయ స్థాయిలో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ వెల్లడించారు. నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించి వివిధ వైద్య కళాశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులను ఆదివారం నారాయణ వైద్య కళాశాల ఆడిటోరి యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణ మెడికల్ అకాడమీ నుంచి 350 మందికిపైగా విద్యార్థులు మెడికల్ సీట్లు పొందారని చెప్పారు. తాము అమలు చేస్తున్న విద్యా విధానం, అధ్యాపకుల కృషే ఇంతటి విజయానికి కారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కోర్ డీన్ జయకుమార్ రాయుడు, డీజీఎంలు మదన్‌మోహన్‌రెడ్డి, మహేష్, డీన్‌లు విష్ణువర్ధన్, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఆలయంలో నుంచి మూకుళ్లలో దీపాలను తీసుకొస్తున్న జీయర్‌స్వామి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్, అధికారులు, అర్చకులు - శ్రీవారి ఆలయంలో వెలుగుతున్న దీపాలు - పుష్కరిణి వద్ద..

కనులపండువగా కార్తీక దీపోత్సవం

శ్రీవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్తీక పౌర్ణమి దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. మొదట యోగనరసింహస్వామి ఆలయం పక్కనున్న పరిమళం అర వద్ద 80 కొత్త మూకుళ్లలో దీపాలను వెలిగించారు. వీటిని ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ, ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. తర్వాత గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, రాములవారిమేడ, ద్వార పాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళమాత, బంగారుబావి, కల్యాణమండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహస్వామి, విష్వక్సేనుడు, చందనం అర, పరిమళం అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయమండపం, పూలబావి, రంగనాయకమండపం, మహాద్వారం, బేడిఆంజనేయస్వామి, వరాహస్వామిఆలయం, పుష్కరిణి వద్ద నెయ్యి నేతి జ్యోతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పౌర్ణమిగరుడసేవను రద్దు చేశారు. ఈ దీపోత్సవంలో పెద్దజీయర్‌స్వామి, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అమ్మవారి ఆలయంలో..

తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి అర్చకులు, అధికారులు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ధ్వజస్తంభం, ఇతర ఆలయాలు, గర్భాలయం, పుష్కరిణి, ఆస్థాన మండపంతోపాటు పలు ప్రాంతాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, చలపతి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



హెల్మెట్ లేకుంటే ప్రాణాపాయమే

హైకోర్టు ఆదేశాలతోనైనా కనువిప్పు కలిగేనా?

మూడేళ్లలో 1000 ప్రమాదాలు.. 870 మంది మృతి

ముప్పని తెలిసినా.. ఎందరు చెప్పినా..

తలకెక్కడం లేదు

మెదడు సున్నితమైంది. మొత్తం 22 ఎముకలు ఉంటాయి. 85 నుంచి 120 బిలియన్ల న్యూరాన్లు ఉంటాయి. దీంతో మెదడుకు చిన్న దెబ్బ తగిలినా ఆ ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది' అని న్యూరాలజీ వైద్యులు చెబుతున్నారు. అందుకే తలకు రక్షణగా హెల్మెట్ వాడాలంటున్నారు.

● రేణిగుంటలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ అక్టోబరు 30వ తేదీన రుయాలో అవుట్ పోస్టు విధులు నిర్వహిస్తున్నారు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఎల్‌బీ నగర్‌కు వెళుతుండగా వకుళమాత ఆలయం వద్ద వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

● చంద్రగిరి సమీపంలోని కోదండరామాపురం వద్ద జాతీయ రహదారిపై జూన్ రెండో తేదీన పెరుమాళ్లపల్లి ఎస్వీనగర్‌కు చెందిన విశ్వనాథ్, అతని బంధువు అమ్ములు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

● కరకంబాడికి చెందిన గోపాలకృష్ణ ఈ ఏడాది డిసెంబరు 8న ద్విచక్ర వాహనంపై రేణిగుంటకు వస్తున్నారు. అమర ఆస్పత్రి వద్ద రోడ్డుపై ఉన్న గుంత కనపడక పోవడంతో అందులో పడి తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళుతుండగా మృతి చెందారు.

.. ఇలా రోజూ ఎన్నో ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయి. హెల్మెట్ ధరించడం వల్ల ఈ మరణాల్లో కొన్నింటినైనా నివారించగలిగే అవకాశం ఉంది.

ద్విచక్ర వాహనదారుల నిర్లక్ష్యం.. అతివేగం.. అవతలి వాహనదారుల తప్పిదాలు.. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వందలాది మంది అసువులు బాస్తున్నారు. మృతుల సంఖ్య పెరగడానికి హెల్మెట్ ధరించకపోవడం ప్రధాన కారణంగా పోలీసు లెక్కలు చెబుతున్నాయి. దాదాపు 90 శాతం మంది హెల్మెట్ ధరించడంలేదని తెలుస్తోంది. అదే సమయంలో హెల్మెట్ ధరించేలా ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. తామెన్ని కార్యక్రమాలు చేసినా 70 నుంచి 80 శాతం మందిలో మార్పు కనిపించడంలేదని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు మేల్కొని ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించాలి. వాహనదారులూ స్వీయ రక్షణ తీసుకోవాలి. రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షలు వెచ్చించి ద్విచక్ర వాహనాలు కొంటున్నారు. అదే రూ.వెయ్యిలోపు హెల్మెట్ కొనడానికి చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. కొన్నా ధరించడంలేదు. మెదడు సున్నితమైంది. చిన్న దెబ్బ తగిలినా ఆ ప్రభావం చాలాతీవ్రంగా ఉంటుంది' అని తాజాగా హైకోర్టు వ్యాఖ్యానించింది. దీంతో ఇకనైనా మార్పు వస్తుందా అనేది చూడాలి.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



2022, 2023 తో పోల్చుకుంటే ఈ ఏడాది ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. ఇక, క్షతగాత్రుల్లో ఎంతో మంది అంగవికలురుగా మారారు. పెద్దలకు తగిలిన 'దెబ్బ' ఆ కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై తీవ్రప్రభావం చూపాయి.

మూడేళ్లలో ద్విచక్ర వాహన ప్రమాదాల లెక్క

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	173	187 మంది	65 మంది
2023	22	44 మంది	12 మంది
2024 (నవంబరు వరకు)	1,045	435 మంది	110 మంది

ముగిసిన నీటి సంఘాల ఎన్నికలు

● 608 ఫలితాల ప్రకటన ● మరో రెండు వాయిదా

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నిక ప్రక్రియ ఆదివారం వేకువజాము వరకు సాగింది. మొత్తం 610 నీటి సంఘాలకు ఎన్నికలు జరగ్గా, శనివారం అర్ధరాత్రి సమయానికి 603 సంఘాలకు ఫలితాలు విడుదలయ్యాయి. మిగిలిన ఏడింటి పోలింగ్ ప్రక్రియ ఆదివారం వేకువజాము వరకు సాగింది. మొత్తం 608 సంఘాలకు ఎన్నికల ప్రక్రియ ముగిసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు ప్రకటించారు. ఏర్పేడు మండలం మన్నసముద్రం, తొట్టంబేడు మండలం గుండేలుగుంట నీటి సంఘాల ఎన్నిక వాయిదా పడినట్లు ఈఈ మదన్‌గోపాల్ వెల్లడించారు. మన్నసముద్రంలో బీజేపీ అభ్యర్థి కోలా ఆనంద్, టీడీపీ అభ్యర్థి రెడ్డివారి గురవారెడ్డి మధ్య సయోధ్య కుదరకపోవడం, గుండేలుగుంటలో ఇద్దరు టీడీపీ అభ్యర్థులు తానంటే తానంటూ పోటీపడటంతో వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఇక, పిచ్చాటూరు మండలం ఆరూరు కమిటీ ఉపాధ్యక్షుడు, జిల్లావ్యాప్తంగా వివిధ కమిటీలకు చెందిన 44 మంది సభ్యుల స్థానాల ఎన్నిక వాయిదా పడినట్లు మదన్‌గోపాల్ వివరించారు. 17వ తేది తర్వాత వాటికి మళ్లీ నోటిఫికేషన్ జారీచేసి, ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భద్రతతో కూడిన విద్య అందిస్తాం

● అన్ని జిల్లాల్లో బీసీ భవనాలను నిర్మిస్తాం
● బీసీ బాలికల కళాశాల హాస్టల్‌ను సందర్శించిన మంత్రి సవిత
● బీసీల ద్రోహిగా జగన్ నిలిచిపోతారని విమర్శ

తిరుపతి, డిసెంబర్15 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందిస్తామని రాష్ట్ర బీసీ, సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రతి హాస్టళ్లోనూ, గురుకుల పాఠశాలల్లోనూ ఇన్వర్టర్లతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. స్పష్టంచేశారు. తిరుపతిలోని బీసీ బాలిక హాస్టల్‌ను ఆదివారం ఆమె సందర్శించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

అనంతరం హాస్టల్‌లోని గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, హాస్టల్ నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలుపై ఆరా తీశారు. ఈ వసతి గృహం మరమ్మతులకు రూ.8లక్షలు మంజూరు చేశామని తెలిపారు. జిల్లాను ఎడ్యుకేషన్ హబ్ తయారు చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. పొట్టి శ్రీరాములు పట్టుదల, అంకుఠిత దీక్ష నేటి యువతకు ఎంతో అవసరమన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ చరిత్రలో ఎన్నడూ లేనంతగా బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లకు పైగా కేటాయించిందన్నారు. బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.25 కోట్లు కేటాయించామన్నారు. పరిశుభ్ర వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ఏ నమ్మకంతో తమ పిల్లలను బీసీ హాస్టళ్లకు పంపుతున్నారో.. అదే భరోసాతో కంటకి రెప్పలా కాపాడుతున్నామన్నారు.

ప్రతి ఇంటి నుంచీ ఓ వ్యాపార వేత్త

బీసీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచీ ఒక వ్యాపారవేత్తను రూపొందించేలా ప్రణాళికలు తయారు చేశామన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో హాస్టళ్లను సందర్శించినప్పుడు తీవ్రమైన సమస్యలను గుర్తించామన్నారు. విద్యార్థులకు డైట్ బిల్లులు కూడా రాలేదని వార్డెన్లు చెప్పారు. ఈ విషయం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి డైట్ బకాయిలు చెల్లించామన్నారు. అన్ని హాస్టళ్లలోనూ నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. 2014-19లో టీడీపీ పాలనలో 70శాతం వరకు బీసీ భవనాలు పూర్తయ్యాయన్నారు. ఆ తర్వాత సీఎం అయిన జగన్.. వాటిని పట్టించుకోలేదన్నారు. అసంపూర్తి భవనాలతోపాటు కొత్త జిల్లాల్లోనూ బీసీ భవనాలను నిర్మిస్తామని మంత్రి తెలిపారు. హాస్టళ్ల నిర్వహణ, మరమ్మతులను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. చివరికి విద్యార్థుల డైట్ బిల్లులూ చెల్లించలేదన్నారు. గత ఐదేళ్ల బీసీలకు అన్యాయం చేసిన జగన్.. బీసీ ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు.ఆయన ఐదేళ్లలో చేయని అభివృద్ధిని ఐదు నెలల్లో చేసి చూపించామన్నారు. 11 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి రాని జగన్ ఇంట్లో ప్రెస్‌మీట్లు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, బీసీ వెల్ఫేర్ అధికారులు చంద్రశేఖర్, జ్యోత్స్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముక్కంటి దర్శన వేళల్లో మార్పు

శ్రీకాళహస్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం నుంచి దర్శన వేళల్లో మార్పు చేసినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెల్లవారుజామున 3గంటలకు పురవీధుల్లో జేగంట,4గంటలకు మంగళ వాయిద్యాలు, 4.15 గంటలకు గోపూజ, తిరుమంజనం, 4.30గంటలకు పల్లియర పూజ(సుప్రభాతం లేదు), తేవారం, ఉదయం 5గంటలకు సర్వదర్శనం, మొదటికాల అభిషేకం(సేవలు లేవు), 6గంటలకు రెండవ కాల అభిషేకం, 7గంటలకు పరివార దేవతా నైవేద్యం, 7.30గంటలకు గొబ్బెమ్మ ఉత్సవం, 10.30 గంటలకు మూడవ కాలాభిషేకం(ఉచ్చికాలం), సాయంత్రం 5గంటలకు ప్రదోషకాలాభిషేకం ఉంటుందని తెలియజేశారు. శుక్రవారం, శనివారం, ఆదివారం, సోమవారం రోజుల్లో రాత్రి 9గంటలకు పల్లియ పూజ, మంగళ, బుధ, గురువారాల్లో రాత్రి 9గంటలకు పల్లియర పూజల అనంతరం దర్శనం ముగింపు ఉంటుందని పేర్కొన్నారు. మూడవ కాలాభిషేకం, సాయంత్రం 4గంటలకు జరిగే మహన్యాస పూర్వక రుద్రాభిషేకానికి మాత్రం భక్తులకు టిక్కెట్లు ఇస్తామని తెలిపారు. ఇక 13వ తేదీ ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం నటరాజస్వామికి అభిషేకం, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి వేడినీళ్లతో అభిషేకం, సాయంత్రం అరికట్ల ఉత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని సేవలు, అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

తుడా ఉత్కంఠకు తెర పడేనా..!

● చైర్మన్ రేసులో శంకర్ రెడ్డి?

తిరుపతి, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్ పదవిపై ఉత్కంఠకు త్వరలో తెరపడనుంది. టీడీపీ, జనసేన కూటమి పార్టీల నుంచి పలువురు పోటీపడుతున్న నేపథ్యంలో ఈ పదవికి కొంతకాలంగా ప్రతిష్టంభన నెలకొంది. రాష్ట్రంలో దాదాపు అన్ని పట్టణాభివృద్ధి సంస్థలకు చైర్మన్లను నియమించినప్పటికీ సీఎం చంద్రబాబు నాయుడు తుడాను మాత్రం భర్తీ చేయకుండా వాయిదావేస్తూ వచ్చారు. తొలినుంచీ తుడా రేసులో ముందున్న ప్రముఖ కాంట్రాక్టర్ కె.శంకర్‌రెడ్డి పేరు దాదాపుగా ఖరారైనట్టు ప్రచారం జరుగుతోంది. తొలినుంచి టీడీపీకి విధేయుడిగా ఉన్న ఆయన ఎన్నికల ముందు శ్రీకాళహస్తి అసెంబ్లీ టికెట్ ఆశించిన జాబితాలో ఉన్నారు. టీడీపీ యువనేతతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో తుడా పదవి ఆయన్నే వరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈవారంలో అధినేత నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

టీడీపీ ఆశావహుల్లో నిరాశ

పొత్తుల్లో భాగంగా తిరుపతి సీటు జనసేనకు కేటాయించడంతో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తుడాపై ఆశలు పెట్టుకున్నారు. అదేవిధంగా పార్లమెంటు అధ్యక్షుడు, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ కూడా మరోసారి తుడా కుర్చీని ఆశిస్తున్నారు. అందుకే నెలరోజుల క్రితం రాష్ట్ర యాదవ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నరసింహ యాదవ్‌ను నియమించినప్పటికీ ఆయన ఇప్పటివరకు ప్రమాణస్వీకారం చేయలేదు. వీరు నిరాశపడే పరిస్థితి కనిపిస్తోంది.

సభ్యత్వ నమోదులో వెనుకంజ అందుకేనా?

టీడీపీ నేతలు ఆశించిన పదవులు రాకపోవడం, వచ్చిన పదవుల్లోనూ కొందరు అసంతృప్తిగా ఉండడం, భవిష్యత్తులో పదవులు వస్తాయో? రావో అన్న గ్యారెంటీ లేకపోవడం వంటి కారణాలవల్లే టీడీపీ సభ్యత్వ నమోదులో తిరుపతి వెనుకబడివుందని అంటున్నారు. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 50వేల సభ్యత్వ నమోదు చేయాలని పార్టీ సూచించింది. ఇప్పటివరకు 20వేలు కూడా దాటని పరిస్థితి నెలకొంది. 175 నియోజకవర్గాల్లో చివరి పాతిక నియోజకవర్గాల్లో తిరుపతి ఉండడంపై పార్టీ అధిష్ఠానం అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది.



అమరజీవికి ఘన నివాళి

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యుడు పొట్టి శ్రీరాములు అని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆదివారం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించారు. నేటితరానికి ఆయన ఆదర్శప్రాయులన్నారు. డీఆర్వో నరసింహులు, సహాయ బీసీ సంక్షేమాధికారిణి జ్యోత్స్న, బీసీ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం, ఆదివారం.. వరుస సెలవులతో శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 27వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,015మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,575మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,617మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,093, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 364మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 262మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 81మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 23,397 అమ్ముడైనట్లు అధికారులు వివరించారు.

దుమ్ము రేపుతూ... రోడ్లను ఛిద్రం చేస్తున్నాయ్!

టిప్పర్లను అడ్డుకుని చిల్లమానుచేను గ్రామస్తుల నిరసన



టిప్పర్లను నిలిపివేసి నిరసన తెలుపుతున్న చిల్లమానుచేను గ్రామస్తులు

ఓజిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామమంతా దుమ్ముతో నిండిపోతోంది... సమీపంలోని నిమ్మ తోటలు ఎండిపోతున్నాయి... పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు... అడుగడుగునా గుంతలు ఏర్పడి రోడ్డు ఛిద్రమైపోతోంది... అంటూ ఓజిలి మండలంలోని చిల్లమానుచేను గ్రామస్తులు ఆదివారం గ్రామం మీదుగా వెళుతున్న టిప్పర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని చిల్లమానుచేనుకు సమీపంలో ఉన్న క్వారీ నుంచి రోజూ టన్నుల కొద్దీ మెటల్ తరలిస్తున్న టిప్పర్ల వల్ల పెద్దపరియ వరకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైపోయిందన్నారు. గుంతల దారిలో ప్రయాణం చేయలేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతన్నారని చెప్పారు. టిప్పర్ల రాకపోకల వల్ల దుమ్ము లేచి ఇళ్లలోకి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఎంతో మంది శ్వాసకోశ సమస్యలతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, క్వారీ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు చిల్లమానుచేను గ్రామానికి చేరుకుని స్థానికులకు సర్దిచెప్పి టిప్పర్ల రాకపోకలను కొనసాగించారు.

రైలు ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం



వినయ్‌కుమార్‌కు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు, పక్కన టీడీపీ నాయకులు రమేష్, కిషోర్ తదితరులు

సూళ్లూరుపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకొన్న సూళ్లూరుపేటకు చెందిన ఆర్.వినయ్ కుమార్‌కు కృత్రియ అవయవాల కోసం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు రూ.46 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో వినయ్‌కుమార్‌కు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంగళంపాడులో పారిశుధ్య పనులు

సూళ్లూరుపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని మంగళంపాడులో వీధులన్నీ మురుగుమయంగా మారాయి. సర్పంచు రుక్మిణి, టీడీపీ నాయకుడు సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో మురుగునీటి తొలిగించి పారిశుధ్య పనులు చేపట్టారు. విషజ్వరాలు, అంటు వ్యాధుల ప్రబలకుండా బ్లీచింగ్‌తో పాటు సున్నం చల్లి వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సాగునీటి సంఘ అధ్యక్షుడుశేషాద్రి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఆశా వర్కర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వానికి విశేష ఆదరణ



తిన్నెలపూడిలో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న సుష్మారెడ్డి

కోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని జిల్లా తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిన్నెలపూడిలో సభ్యత్వ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీలో సభ్యత్వం ఉన్న వారికి బీమా సౌకర్యం ఉందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్నా సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన ప్రజలు ఆసక్తి పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు చూపుతున్నారని చెప్పారు. ఒక్క తిన్నెలపూడి పోలింగ్ బూత్ 196 పరిధిలో 550 మంది స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వం తీసుకొన్నారని తెలిపారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గూడూరు నియోజక వర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు.

దివ్యాంగులకు కోడి గుడ్లు, కూరగాయల పంపిణీ



దివ్యాంగులకు కోడిగుడ్లు, కూరగాయాలు అందజేస్తున్న జేవీవీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

గూడూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీవీసీ పార్కులో గోపాల్ దాతృత్వంతో ఆదివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులకు కోడి గుడ్లు, కూరగాయలను అందజేశారు. జేవీవీ పట్టణా అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు జేవీవీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అంతేకాకుండా పేదలకు చేయూతనందించేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, చెంచు నారాయణ, విజయ్‌బాబు, ఇబ్రహీం, సుధీర్, సుమన్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల అందజేత



నిత్యవసరాలు అందజేస్తున్న సింహపురిరెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులు

గూడూరు అర్బన్, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దన్ రెడ్డి, రోహిణి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో కార్డెన్ సెర్చ్

కోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ జరిగింది. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎస్ఐలు పవన్‌కుమార్, నాగబాబు, బలరామయ్య ఆధ్వర్యంలో కేశవరం గ్రామంలో కవాతు నిర్వహించారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. దొంగతనాలకు పాల్పడితే జరిగే పరిణామాలను స్థానికులకు వివరించారు.



పోలీసులకు సూచనలిస్తున్న సీఐ హుస్సేన్‌బాషా

వైద్యసేవలకు దూరమౌతున్న డక్కిలి ఆస్పత్రి

- ఆరు నెలల్లో ఆరు కాన్పులే
- అత్యవసర కేసులైనా సరే ఇతర ప్రాంతాలకు రెఫర్
- 30 పడకల నుంచి పీహెచ్‌సీ స్థాయికి తగ్గించిన వైసీపీ
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు



డక్కిలిలోని ప్రభుత్వాస్పత్రి

డక్కిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డక్కిలిలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు సన్నగిల్లుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతమైన డక్కిలి మండలవాసులకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి 30 పడకల ఆస్పత్రి ప్రారంభించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ ఆస్పత్రి బాగోగులు పట్టించుకోకపోవడమే కాక పీహెచ్‌సీ స్థాయికి తగ్గించింది. అదేవిధంగా ఆస్పత్రిలో సిబ్బందినీ తగ్గించేసింది. దీంతో వైద్యసేవలకు పేదలు దూరమౌతూ వస్తున్నాయి. తప్పని పరిస్థితుల్లో రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. డక్కిలి పీహెచ్‌సీలో రోజూ 150 నుంచి 200 వరకు ఓపీ నమోదవుతుంది. అలాగే రోజుకు పది నుంచి 20 మంది వరకు గర్భిణులు వైద్యసేవలు పొందేందుకు వస్తుంటారు. కానీ కాన్పులు మాత్రం చేయడంలేదు. గడిచిన ఆరు నెలల్లో కేవలం ఆరు కాన్పులు మాత్రమే జరిగాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మండలంలో రాత్రి వేళల్లో గర్భిణులకు నొప్పులు వచ్చి ఆస్పత్రికి వైద్యులెవ్వరూ అందుబాటులో ఉండటం లేదు. దీంతో గర్భిణులు వ్యయప్రయాసల కోర్చి వెంకటగిరి లేదా రాపూరు, గూడూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ పనిచేసే వైద్యులు అందరూ వెంకటగిరి, రాపూరు, గూడూరు ప్రాంతాల్లో నివాసం ఉంటుండగా వైద్య సిబ్బంది మాత్రం నెల్లూరు పట్టణంలో నివాసాలు ఏర్పరుచుకొన్నారు. ఇక మండలంలో 14 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నప్పటికీ కాన్పుల కేసు లేవీ డక్కిలి పీహెచ్‌సీకి రావడం లేదు. ఇక్కడి డీసీఎస్ హరిత గత రెండేళ్ల నుంచి తిరుపతి డీఎం అండ్ హెచ్‌వో ఆఫీసుకు డిప్యుటేషన్‌పై వెల్లడంతో ఇక్కడి పీహెచ్‌సీని పట్టించుకొనేవారే లేరని స్థానికులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతధికారులు చొరవ తీసుకొని డక్కిలి పీహెచ్‌సీలో వైద్య సేవలు మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

చందన షాపింగ్‌మాల్ ప్రారంభం



షాపింగ్ మాల్‌లో నగలను చూపిస్తున్న రీతువర్మ

సూళ్లూరుపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సినీనటి రీతువర్మ సందడి చేశారు. సూళ్లూరుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన చందన షాపింగ్ మాల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వళన చేశారు. అనంతరం రీతువర్మ షాపింగ్ మాల్‌లో ఉన్న బంగారు ఆభరణాలు, దుస్తుల డిజైన్లను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను సూళ్లూరుపేటకు వచ్చి షాపింగ్‌మాల్ ప్రారంభించడం సంతోషంగా ఉందని, ఇక్కడ ప్రజలు ఎంతో అప్యాయత చూపిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్ద నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్న సూళ్లూరుపేటలో చందన లాంటి షాపింగ్ మాల్ ప్రారంభం కావడం వల్ల ఎందరో నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. తమ సంస్థ నాణ్యతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందని షాపింగ్ మాల్ నిర్వాహకులు సంతోష్, గణేష్ తెలిపారు. కార్యక్రమంలో పెంచలకోన ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, వీహెచ్‌పీ నాయకులు

గూడూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న డిమాండ్‌తో రాష్ట్రం వ్యాప్తంగా హిందువులందరూ వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం సభ నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సభను అందరం కలిసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురళీరెడ్డి, రమణయ్య, హరిబాబు, మల్లిఖార్జున, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమో ఇంజనీర్ల గౌరవ అధ్యక్షుడిగా రియాజ్ అహ్మద్



రియాజ్ అహ్మద్‌ను అభినందిస్తున్న అశోక్‌బాబు

గూడూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ డిప్లొమో ఇంజనీర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా గూడూరుకు చెందిన రియాజ్ అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తిరుపతిలో నిర్వహించిన పంచాయతీ రాజ్ డిప్లొమో ఇంజనీర్ల సంఘం సర్వసభ్య సమావేశంలో ఈయనను ఎన్నుకోవడం జరిగింది. రియాజ్ అహ్మద్‌కు ఎమ్మెల్సీ అశోక్‌బాబు, సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ డిప్లొమో ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి రియాజ్ అహ్మద్ ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

కోటమ్మ ఆలయంలో లలితాహోమం



లలితహోమం చేస్తున్న ఆలయ ధర్మకర్తలు

కోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మ ఆలయంలో మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం లలితాహోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో భక్తులు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ లలితాహోమాన్ని నిర్వహించారు.

తైక్వాండో శిక్షకుడికి క్రీడారత్నం అవార్డు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ సీనియర్ అసిస్టెంట్, విద్యాసంస్థల తైక్వాండో కోచ్ కొమ్మినేని గోపీనాయుడికి క్రీడారత్నం అవార్డు దక్కింది. బెంగళూరు వేదికగా ఆదివారం జేపీ పార్కు కప్ 2024 ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. గోపీనాయుడు కోచ్‌గా అనేక మంది క్రీడాకారులను తయారు చేస్తున్న విషయాన్ని గుర్తించి, పోటీల ఆర్గనైజర్ పెంచలయ్య ఈ అవార్డు ప్రదానం చేశారు.



అవార్డు స్వీకరిస్తున్న గోపీనాయుడు

జాతీయస్థాయి కర్రసాము పోటీల్లో

8మందికి బంగారు పతకాలు



కర్రసాములో పతకాలు సాధించిన క్రీడాకారులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కర్రసాము చాంపియన్ షిప్-2024 పోటీలను డిసెంబరు 13, 14 తేదీల్లో నెల్లూరులో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించినట్లు కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, కోచ్ ఉయ్యాల పవన్ ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో 380 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో 23మంది నాయుడుపేట క్రీడాకారులు పాల్గొనగా 8మంది బంగారు పతకాలు, ఆరుగురు వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు.

హరినాథరెడ్డి మృతి తీరని లోటు: నెలవల



హరినాథరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు

పెళ్లకూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి ఎన్నో ఏళ్లుగా విశేష సేవలందించిన నందిమాల గ్రామానికి మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నాయకుడు నల్లాడి హరినాథరెడ్డి(85) లేని లోటు తీర్చ లేనిదని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. హరినాథరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలో ఓ ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందారు. ఆదివారం నందిమాలలో అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డితో కలిసి నెలవల సుబ్రహ్మణ్యం నందిమాల గ్రామానికి చేరుకుని హరినాథరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హరినాథరెడ్డి భార్య పరమేశ్వరమ్మ, కుమారులు సుధాకర్ రెడ్డి, శివకృష్ణారెడ్డిని ఓదార్చారు. హరినాథ్‌రెడ్డితో తనకున్న సాన్నిహిత్యాన్ని నెలవల గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు దామెర ప్రసాద్ నాయుడు, నేలవల్లి సిద్యులయ్య నాయుడు, పీవీ కృష్ణారెడ్డి, మదన్‌మోహన్‌నాయుడు, తాళ్ల యుగంధర్ గౌడ్, వెంకటయ్య, మల్లిరెడ్డి, మునివర్ధన్‌రెడ్డి, గుంటపూడి రమణయ్య తదితరులు ఉన్నారు.

కాశీవిశ్వేశ్వర ఆలయంలో గోపూజ



ఆలయం వద్ద గోపూజ చేస్తున్న నిర్వాహకులు

తడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్నమాంబట్టులో వెలిసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఆదివారం తమిళ కార్తీక మాస పౌర్ణమి సందర్భంగా స్వామివార్లకు విశేష పూజలు జరిగాయి. గోపూజ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు డాక్టర్ మల్లికార్జున, అముద దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆర్ఎం ఉమామహేశ్వర రావు, విష్ణుప్రియ, తిరుపతి సిమ్స్ వైద్యులు మునస్వామి, అనిల్‌రెడ్డి, చండీ రాణెమ్మ, దేవేందర్‌రెడ్డి, మోహన్ రావు, ముద్దుకృష్ణయ్య పాల్గొన్నారు.

అన్నదానం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక బొప్పాపురం రాధాకృష్ణ మందిరంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వివేకానంద యువసైన్యం ఆధ్వర్యంలో నిర్వాహకులు ఏపీపీ ప్రకృతి కుమార్ అన్నదానం చేశారు. స్వామి వివేకానంద యువసైన్యం సభ్యులు మన్నూరు అరవింద్, చిన్నమద్దేరి గోపీనాథ్, వీరభద్రయ్య, గణేష్, శ్రీనివాసాచారి, మధుకర్ పాల్గొన్నారు.

అయిదేళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పెళ్లకూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని ఓ దళితవాడలో అయిదేళ్ల చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై ఆదివారం పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. బాలిక తల్లిదండ్రులు నెలబల్లి ఉపాధి నిమిత్తం వేరే చోట ఉంటూ సెలవు దినాలలో స్వగ్రామానికి వస్తుంటారు. కుమార్తెతో పాటు 11 ఏళ్ల కుమారుడిని తమ ఇంట్లోనే ఉంచి.. చిన్నారుల అమ్మమ్మను తోడుగా పెట్టారు. శుక్రవారం వీరి అమ్మమ్మ పక్కింటికి వెళ్లగా.. బాలిక ఒక్కటే ఇంట్లోఉంది. ఆ ఇంటికి తరచూ వచ్చే నెలబల్లి సుధాకర్ అనే యువకుడు ఒంటరిగా ఉన్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. అదే సమయంలో ఆమె అమ్మమ్మ ఇంటికి రావడంతో పరారయ్యాడు. ఏడుస్తున్న బాలికను అడగ్గా... వచ్చీరాని మాటలతో అతడి అసభ్యకర ప్రవర్తన గురించి చెప్పింది. శనివారం రాత్రి ఇంటికి వచ్చిన బాలిక తల్లిదండ్రులకు ఆమె చెప్పడంతో.. వారు ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, స్థానిక ఎస్ఐ నాగరాజుతో కలసి గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా.. వేదించినా.. కఠిన చర్యలు తప్పవని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఇలాంటి ఘటనలపై ఇప్పటికే అన్ని పాఠశాలలతో పాటు ప్రజల్లో విస్తృత్తంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అఘుత్యాలకు, నేరాలకు పాల్పడితే ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సమన్వయంతో ముందుకెళ్తాం: బీజేపీ



బీజేపీ అభ్యర్థులను అభినందిస్తున్న ఎద్దల నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమిలోని కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన సమన్వంతో పనిచేస్తూ ముందుకెళ్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ధన్యవాదాలు అన్నారు. మండలంలోని పాలచ్చూరు, పెన్నేపల్లి సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికైన బీజేపీ మద్దతుదారులు కట్టంరెడ్డి రాజారెడ్డి, గోగుతొట్టి సుబ్బులయ్యను అభినందించారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన బీజేపీకి రెండు సాగునీటి సంఘాలు కేటాయించినందుకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే అన్ని ఎన్నికల్లో సమన్వంతో ముందుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

కోట, నాయుడుపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని పొట్టి శ్రీరాములు క్యాంస విగ్రహానికి కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన ఆర్యవైశ్యసంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కనమర్లపూడి సుబ్రమణి, తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షుడు గూడూరు కిషోర్, కార్యదర్శి గాధంశెట్టి నాగరాజు, ఆర్యవైశ్య యువజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి సోల్లేటి చంద్రశేఖర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కులను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావు

గూడూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం దళితులకు ప్రసాదించిన హక్కులను కాపాడే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల చట్టాలను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు సమిష్టిగా పోరాటాలు చేపట్టి హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగభూషణం, నాగరాజన్, మురళి, బలరాం, కాలయ్య, ప్రభాకర్, తులసీ రాజన్, శశికుమార్, మస్తానయ్య, నాగేంద్ర, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సుబుదేంద్రతీర్థ

తిరుచానూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం మంత్రాలయం రాఘవేంద్ర మఠాధిపతి సుబుదేంద్ర తీర్థ తన శిష్య బృందంతో దర్శించుకున్నారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి, తర్వాత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అమ్మవారి శేషవస్త్రంతో ఆయన్ను ఆలయ అర్చకులు సత్కరించారు.